# వాస్తవం

డెయిలీ. కామ్

ఆదివారం 20.09.2026

ఉన్నది ఉన్నట్లుగా

డిజిటల్ పత్రిక

ఎడిటర్: ఎం.కృష్ణారెడ్డి(కె.ఆర్)


## స్టార్టప్‌లే భారతదేశపు యువత సత్తాకు నిదర్శనం

**ప్రధానమంత్రి నరేంద్రమోదీ**



దేశ యువత సామర్థ్యానికి, వారి సత్తాకు దేశం లోని స్టార్టప్ పర్యావరణ వ్యవస్థే ఒక గొప్ప ఉదా హరణ అని ప్రధానమంత్రి నరేంద్రమోదీ అన్నారు. ఒకప్పుడు కేవలం పెద్ద నగరాలకే పరిమితమైన స్టా ర్టప్‌ల కథ ఇప్పుడు చిన్న పట్టణాలకు, నగరాలకు కూడా విస్తరించిందని ఆయన పేర్కొన్నారు.

7లో..

# దానం.. అంతర్మథనం

బీఆర్ఎస్ పార్టీ తరపున ఎమ్మె ల్యేగా గెలుపొంది కాంగ్రెస్‌లోకి ఫిరాయించి అనర్హత వేటుకు గురైన దానం నాగేందర్ యూటర్న్ తీసు కున్నారు. హైకోర్టు తీర్పును స్వాగతిస్తున్నా, ఉప ఎన్నికకు సిద్ధమేనని ప్రకటించిన దానం సుప్రీం కోర్టును ఆశ్రయించారు. తన ఎమ్మెల్యే సభ్యత్వాన్ని రద్దు చేస్తూ హైకోర్టు ఇచ్చిన తీర్పును సవాల్ చేస్తూ అత్యున్నత ధర్మాసనంలో శనివారం ఆయన పిటిషన్ వేశారు. ఫిరాయింపు ఎమ్మెల్యే దానం నాగేందర్ ఒక్కరోజులోనే మాట మార్చారు.



7లో..

### దానం ప్లాన్‌కు చెక్!

**సుప్రీంకోర్టులో విచారణకు ముందే కేవియట్ దాఖలు**

దానం నాగేందర్ వ్యవహారంపై తెలంగాణ రాజకీయాల్లో కీలక పరిణా మం చోటు చేసుకుంది. ఈ అంశంపై బీజేపీ ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి సుప్రీం కోర్టులో ముందస్తుగా కేవియట్ పిటిషన్ దాఖలు చేశారు. తన అనర్హతపై తెలంగాణ హైకోర్టు ఇచ్చిన తీర్పును సవాలు చేస్తూ దానం నాగేందర్ సుప్రీం కోర్టును ఆశ్రయించడంతో.. బీజేపీ, బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు అలర్ట్ అయ్యారు. దానం నాగేం దర్ సుప్రీంకోర్టులో పిటిషన్ వేస్తే.. తమ వైపు వాదనలు వినకుండా ఎలాంటి ఏకపక్ష ఆదే శాలు లేదా మధ్యంతర ఉత్తర్వులు ఇవ్వ కూడదని కోరుతూ ఏలేటి మహేశ్వర్ రెడ్డి, పాడి కౌశిక్ రెడ్డి ఈ కేవియట్ దాఖలు చేశారు.

- నిన్నటికి నిన్న ప్రజాక్షేత్రంలోనే తేల్చుకుంటానంటూ సవాల్
- రోజు తిరుగకుండానే హైకోర్టు తీర్పుపై సుప్రీంకోర్టులో పిటిషన్
- నాగేందర్ నిర్ణయం మార్పు వెనుక మర్మం ఏంటి?
- ఎన్నికల్లో కొట్లాడుదామన్న మాటపై నమ్మకం లేదా?
- ఉప ఎన్నికలో పార్టీ టికెట్ రాదని అనుమానమా?

గడిచిన ఎన్నికల్లో బీఆర్ఎస్ తరపున ఖైరతాబాద్ నుంచి ఎమ్మెల్యేగా గెలిచిన మూడు నెలలకే దానం కాంగ్రెస్‌లోకి దూకడం వెనుక అధికా రం కోసమే అన్నది బహిరంగ రహస్యం. వాస్తవానికి గ్రేటర్ హైదరా బాద్ పరిధిలో కాంగ్రెస్‌కు ప్రాతినిధ్యం లేకపోవడంతో తాను పార్టీ మారితే ఆ కోటా నుంచి మంత్రివర్గంలోకి పోవచ్చనే ఆశతో దానం కాంగ్రెస్ కండువా కప్పుకున్నారనేది వాస్తవం. కానీ ఆయన ఒకటి తలిస్తే.. పరిస్థితి మరొకలా మారింది. సికింద్రాబాద్ పార్లమెంటు స్థా నానికి ఆయనను అభ్యర్థిగా నిలపడంలో ఓ 'ముఖ్య' నేతనే కీలక పాత్ర పోషించారనేది అప్పట్లో అందరికీ తెలిసిందే. పార్లమెంటు ఎన్నికల్లో ఓటమి తర్వాత నెలలు గడిచినా మంత్రి పదవి దక్కకపోవడంతో మోస పోయానని ఆయన గ్రహించారు.

## జన్వాడ ఫాంహౌస్.. అక్రమ నిర్మాణం

- అనుమతులు లేకుండా నాలాపై నిర్మించారు
- విచారణ జరిపి చర్యలు తీసుకోండి
- హైడ్రా కమిషనర్‌కు కాంగ్రెస్ నేతల ఫిర్యాదు
- జన్వాడకు వచ్చిన ఎంపీలు, ఎమ్మెల్యేల బృందం

జన్వాడలోని ఫాంహౌస్ ముమ్మాటికీ అక్రమ నిర్మాణమని కాంగ్రెస్ ప్రజా ప్రతినిధుల బృందం ఆరోపించింది. ఎలాంటి అనుమతులు లేకుండా నాలాపై దీనిని నిర్మించారని తెలిపింది. ఈ నిర్మాణాలపై విచారణ జరిపి తగిన చర్యలు తీసుకోవాలంటూ హైడ్రాకు ఫిర్యాదు చేసింది. శనివారం జన్వాడ ఫాం హౌస్‌ను పరిశీలించేందుకు కాంగ్రెస్ ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు ప్రత్యేక బస్సులో హైదరాబాద్ నుంచి వచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఫాంహౌస్ తనదేనని, ఇక్కడికి వస్తే కేసులు పెడతా నని అంటున్న ప్రదీప్ రెడ్డి ఇన్ని ఎకరాల్లో ఫాంహౌస్ ఎలా కట్టారని ప్రశ్నించారు.



7లో..

## విద్యార్థులకు ఆకర్షణీయమైన యూనిఫాం

- వచ్చే ఏడాదికి ఇప్పటి నుంచే ప్రణాళిక
- తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

**హైదరాబాద్, సెప్టెంబర్ 19:**

విద్యార్థులకు అందించే యూనిఫాం మరింత ఆకర్షణీయమైన రంగుల్లో ఉండాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సూచించారు. డిజైన్లలో వైవిధ్యానికి ప్రయత్నించాలని సీఎం అధికారులను ఆదేశించారు. విద్యార్థులకు అందించే యూనిఫాం, ఇతర సామగ్రి పంపిణీపై ముఖ్యమంత్రి శనివారం సమీక్ష నిర్వహిం చారు. ఈ ఏడాది ప్రభుత్వ పాఠశాలలు, ప్రభుత్వ వసతి గృహాలు, రెసిడెన్షియల్స్ స్కూల్స్ పిల్లలకు ఒక జత యూనిఫాం పంపిణీ పూర్తయిందని, రెం డో జత యూనిఫాంను నెలాఖరులోగా అందజే సా మని సీఎంకు అధికారులు తెలియజేశారు. కేజీబీవీ, మోడల్ స్కూల్ విద్యార్థులకు రెండు జతల యూని ఫాంలు అందజేసినట్లు తెలిపారు. విద్యార్థులందరి కీ నోటు పుస్తకాలు పంపిణీ పూర్తయిందన్నారు. ప్ర భుత్వ వసతిగృహాలు, రెసిడెన్షియల్స్ స్కూల్స్, కేజీ బీవీలు, మోడల్ స్కూళ్లలోని విద్యార్థులందరికీ ప్లేట్లు, గ్లాసులు, కటోరాలు, స్పూన్లు, కప్పులు, కార్పె



ట్లు, బెడ్ షీట్లు, టవళ్లు పంపిణీ పూర్తయిందని సీఎంకు అధికారులు వివరించారు. వచ్చే ఏడాది పాఠశాలలు తెరిచిన రోజే యూని ఫాం, ఇతర సా మగ్రి విద్యార్థులకు అందేలా ఇప్పటి నుంచే కా ర్యాచరణ ప్రణాళిక రూపొందించాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. ప్రస్తుతం ఉన్న విద్యార్థులకు అద నంగా 10 శాతం విద్యార్థులు పాఠశాలల్లో చేరే అవకాశం ఉన్నందున, అందుకు తగినట్లు ప్రణాళిక రూపొందించుకోవాలన్నారుఈ ఏడాది అందించిన యూనిఫాం, ఇతర సామగ్రి నాణ్యతపై తల్లిదండ్రుల నుంచి సంతృప్తి వ్యక్తమైం దని సీఎం అన్నారు. స మీక్షలో రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు పి.సుదర్శన్ రెడ్డి, ఎంపీ వేం నరేందర్ రెడ్డి, సీఎం ప్రిన్సిపల్ సెక్రెటరీ శ్రీధర్, సీఎం ఓఎస్డీ వేముల శ్రీనివాసులు, వివిధ శాఖల అధికారులు సవ్యసాచి ఘోష్, బాల మాయాదేవి, అహ్మద్ నదీ మ్, దివ్య దేవరాజన్, నవీన్ నికోలస్, శ్రుతి ఓజా, సైదులు, సంతోష్ , సీతా లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## అగార్కర్ ఔట్!

**చీఫ్ సెలెక్టర్‌గా దిగిపోనున్న అజిత్**



**న్యూఢిల్లీ:** ఆలిండియా సీనియర్ క్రికెట్ సెలెక్షన్ కమిటీ చైర్మన్ పోస్టు నుంచి అజిత్ అగార్కర్ దిగిపోతున్నాడు. అక్టోబర్ 4వ తేదీతో ముగియ నున్న తన కాంట్రాక్ట్ పొడిగింపును కోరకూడదని అతను నిర్ణయించుకున్నాడు. ఈ విషయాన్ని అజిత్ ఇప్పటికే బోర్డుకు స్పష్టం చేయడంతో వారు కొత్త చీఫ్ సెలెక్టర్‌ను వెతికే పనిలో ఉన్నట్లు తెలుస్తోంది. 2023 జూలైలో బాధ్యతలు చేపట్టిన అగార్కర్ హయాంలో భారత జట్టు రెండు ఆసియా కప్‌లు (2023, 25), రెండు టీ20 ప్రపంచకప్‌లు (2024, 26), గతేడాది చాం పియన్స్ ట్రోఫీ గెలుచుకుంది. ఓ చీఫ్ సెలెక్టర్‌గా తనకిది గొప్ప ఘనతే. కానీ కొన్నాళ్లుగా అగార్కర్ తీరుపై బోర్డు ఆగ్రహంగా ఉంది. స్టార్ క్రికెటర్ రోహిత్ శర్మ వన్డే భవిష్యత్తుపై బోర్డుతో అతనికి అభిప్రాయ భేదాలు వచ్చాయి. సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ హెడ్ వీవీఎస్ లక్ష్మణ్‌తో ఆటగాళ్ల ఎంపిక, పనిభార నిర్వహ ణపైనా విభేదాలున్నాయి. 2027 వన్డే ప్రపంచకప్‌ను దృష్టిలో ఉంచుకుని రోహి త్‌ను పక్కనబెట్టి యువ ఆటగాళ్లకు అవకాశమివ్వాలని అగార్కర్ భావిం చాడు. కానీ, అతనితో మాట్లాడకుండానే బీసీసీఐ సెక్రటరీ సైకియా రోహిత్‌కు మద్ద తుగా మీడియాకు ప్రకటన విడుదల చేశాడు. దీనికితోడు ఐర్లాండ్, ఇం గ్లండ్ సిరీస్‌ల్లో ఓటమిపై ముంబైలో నిర్వహించిన కీలక సమీక్షా సమావేశానికి అగా ర్కర్ హాజరుకాకపోవడంతో బోర్డుతో అతని బంధం పూర్తిగా తెగిపోయినట్టుంది.

# 38వ డివిజన్‌లో పెండింగ్ సమస్యల పరిష్కారానికి చర్యలు

**●ప్రజలకు ఇచ్చిన హామీల అమలుపై దృష్టి**

**●కార్పొరేటర్ నెలకంటి రాము**

**వాస్తవం :గోదావరిఖని**

గోదావరిఖని 38వ డివిజన్‌లో పెండింగ్‌లో ఉన్న సమస్యల పరిష్కారానికి చర్యలు చేపడుతున్నట్లు కార్పొరేటర్ నెలకంటి రాము తెలిపారు. గత పాలనలో పరిష్కారం కాలేదని పేర్కొంటున్న పలు స్థానిక సమస్యలపై దృష్టి సారించి, వాటిని దశలవారీగా పరిష్కరించేందుకు కృషి చేస్తున్నట్లు ఆయన వెల్లడించారు.డివిజన్ ప్రజలకు గతంలో ఇచ్చిన హామీల అమలుకు ప్రాధాన్యత ఇస్తున్నామని, అందులో భాగంగా అవసరమైన అభివృద్ధి పనులను గుర్తించి సంబంధిత అధికారులతో సమన్వయం చేస్తున్నట్లు రాము తెలిపారు. ప్రజలకు ఇచ్చిన మాటను నిలబెట్టుకునే దిశగా పనులు కొనసాగుతున్నాయని పేర్కొన్నారు. మౌలిక వసతులు, పారిశుద్ధ్యం, రహదారులు, తాగునీరు



తదితర స్థానిక సమస్యలను ప్రజల నుంచి తెలుసుకుని, వాటి పరిష్కారానికి ప్రాధాన్యతా క్రమంలో చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు.డివిజన్‌లో చేపట్టాల్సిన పను లపై ప్రజల నుంచి వచ్చే సూచనలు, ఫిర్యాదులను పరిగ ణన లోకి తీసుకుని ముందుకు సాగుతామని కార్పొరేటర్ నెలకంటి రాము పేర్కొన్నారు.

# ప్రజా సమస్యలపై కార్పొరేటర్ నెలకంటి స్పందన

**38వ డివిజన్‌లో మారుతున్న పరిస్థితులు**

**వాస్తవం : గోదావరిఖని**

డివిజన్‌లో ప్రజా సమస్యలపై స్పందిస్తూ స్థానికంగా అందుబాటులో ఉంటూ సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నట్లు 38వ డివిజన్ కార్పొరేటర్ నెలకంటి రాము పేర్కొన్నారు.డివిజన్‌లో గతంలో ఉన్న సమస్యలను గుర్తించి ప్రస్తుతం వాటి పరిష్కారానికి ప్రాధాన్యత ఇస్తున్నట్లు తెలిపారు. ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులు స్థానిక అవసరాలను తెలుసుకుని సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లడంతో పాటు సాధ్యమైన సమస్యలను స్థానికంగానే పరిష్కరించే దిశగా చర్యలు కొనసాగుతున్నాయని పేర్కొన్నారు."నాడు ఎలా ఉంది.. నేడు ఎలా మారింది" అనే అంశంపై డివిజన్‌లో జరిగిన అభివృద్ధి పనులను ప్రజలకు తెలియజేసే ప్రయత్నం చేస్తున్నామని రాము



తెలిపారు రహదారులు పారిశుద్ధ్యం తాగునీరు డ్రైనేజీ తదితర మౌలిక సదుపాయాలపై ప్రజల నుంచి వచ్చే సూచనలను పరిగణనలోకి తీసుకుంటున్నట్లు చెప్పారు. ప్రజలకు అందుబాటులో ఉండి వారి సమస్యలకు స్పందించడం తన బాధ్యతగాభావిస్తున్నానని కార్పొరేటర్ రాము తెలిపారు.




# ప్రభుత్వ ఆసుపత్రికి నిరంతర నీరు, విద్యుత్ సరఫరా

**-తక్షణ చర్యలు తీసుకోండి**

**- అధికారులను ఆదేశించిన ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు**

**- జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మతో కలిసి సమీక్షా సమావేశం**

**వాస్తవం : భూపాలపల్లి**

ప్రభుత్వ ప్రాంతీయ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న రోగులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా నిరంతరం మంచినీరు, విద్యుత్ సరఫరా ఉండేలా తక్షణ చర్యలు చేపట్టాలని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు స్పష్టం చేశారు. శనివారం సమగ్ర జిల్లా కార్యాలయాల ప్రాంగణ (ఐడిఓసి) కార్యాలయంలో జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మతో కలిసి వైద్య, పురపాలక (మున్సిపల్), మిషన్ భగీరథ, జాతీయ రహదారులు, విద్యుత్ శాఖ అధికారులతో ఆసుపత్రిలో మౌలిక వసతులు, నీటి సరఫరా, విద్యుత్ సమస్యలపై ఆయన సమగ్ర సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, ఆసుపత్రికి వచ్చే పేద రోగులకు నీటి ఎద్దడి లేకుండా చూడాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. జాతీయ రహదారిపై ఉన్న పైప్‌లైన్ దాటే (క్రాసింగ్) సమస్యను తక్షణమే పరిష్కరించి, మిషన్ భగీరథ లేదా పురపాలక పైప్‌లైన్ ద్వారా ఆసుపత్రికి ప్రత్యేక నీటి సరఫరా మార్గాన్ని ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. నీటి సరఫరా యంత్రాల (మోటార్ల) సామర్థ్యాన్ని పెంచేందుకు తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు.విద్యుత్ సరఫరాలో ఎలాంటి అంతరాయాలు రాకుండా అదనపు పరివర్తకాన్ని (ట్రాన్స్‌ఫార్మర్‌ను) అందుబాటులోకి తీసుకురావాలని, విద్యుత్ తీగల (కేబుల్ లైన్ల) మరమ్మతులు చేపట్టడంతో పాటు అవసరమైన చోట్ల అదనపు విద్యుత్ స్తంభాలను ఏర్పాటు చేయాలని విద్యుత్ శాఖ అధికారులకు స్పష్టం చేశారు. ప్రతికూల వాతావరణ పరిస్థితుల్లోనూ విద్యుత్ సరఫరా నిలిచిపోకుండా భూగర్భ (అండర్‌గ్రౌండ్) విద్యుత్ తీగలు లేదా ప్రత్యామ్నాయ విద్యుత్ లైన్ల ఏర్పాటు ప్రతిపాదనలను పరిశీలించి త్వరగా పనులు పూర్తి చేయాలని ఆదేశించారు.ఆసుపత్రి మౌలిక వసతుల సమస్యలను శాశ్వతంగా పరిష్కరించేందుకు సంబంధిత అన్ని శాఖల అధికారులు సంయు



క్తంగా క్షేత్రస్థాయి పరిశీలన నిర్వహించి, అవసరమైన పనులను గుర్తించి యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. ఈ సమీక్షా సమావేశంలో జిల్లా ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్, పురపాలక అధ్యక్షుడు (మున్సిపల్ చైర్మన్) బుర్రా కొమురయ్య, ఉపాధ్యక్షుడు (వైస్ చైర్మన్) అంబాల శ్రీనివాస్, కమిషనర్ ఉదయ్ కుమార్, పురపాలక కార్యనిర్వాహక ఇంజినీర్ (ఈఈ), విద్యుత్, మిషన్ భగీరథ, జాతీయ రహదారుల శాఖ ఇంజినీరింగ్ అధికారులు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## నీటి సౌకర్యానికి బోర్లకు మోటార్లు ప్రారంభం



**వాస్తవం : చందుర్తి**

చందుర్తి మండల కేంద్రంలోని గ్రామపంచాయతీ పరిధిలోని రెండవ, ఆరవ వార్డుల పరిధిల్లో తాగునీటి సమస్య ఉందని ప్రజల కోరిన మేరకు సర్పంచ్ పులి సత్యం గౌడ్ బోర్లకు కరెంటు మోటార్లను శనివారం బిగించి ప్రారంభించారు. తాగునీటి సమస్య నేపథ్యంలో ముందున్న వేసవిలో తీవ్రతరం అవుతుందనే దృష్టితో బోర్లకు మోటార్లు బిగించడం జరిగిందని సర్పంచ్ సత్యం గౌడ్ తెలిపారు. బోర్లకు మోటార్లు బిగించి ప్రారంభించినందుకు వార్డుల ప్రజలు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు మరి రమేష్, రాజు, ఈర్నం జలజ- బాబు, అత్తెన మహేందర్, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## అంబేద్కర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేస్తే సహించేది లేదు



**వాస్తవం : చందుర్తి**

భారత రాజ్యాంగ నిర్మాత, భారతరత్న డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ పై అనుచిత వ్యాఖ్యలు చేస్తు పుస్తకం విడుదలకు ప్రయత్నించిన హమారా ప్రసాద్ పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తు చందుర్తి మండల కేంద్రంలో జాతీయ మాల మహానాడు ఆధ్వర్యంలో శనివారం నిరసన కార్యక్రమం నిర్వహించారు. అంబేద్కర్ విగ్రహానికి పాలాభిషేకం నిర్వహించారు.ఈ కార్యక్రమంలో మాల మహానాడు జిల్లా అధ్యక్షులు నీరటి శ్రీనివాస్, నియోజకవర్గ ఇంచార్జి బత్తుల కమలాకర్, చందుర్తి అధ్యక్షులు బత్తుల శ్రీనివాస్, తిమ్మాపూర్ అధ్యక్షులు కాపిల్ల నరేందర్, సనుగుల అధ్యక్షులు నల్ల కిషోర్, రామన్నపేట బండి బాబు, ఆశఇరెడ్డిపల్లి ఎడ్ల తిరుపతి, తదితరులు పాల్గొన్నారు.

# నేడు చెట్ల కొమ్మల తొలగింపు

**●విద్యుత్ సరఫరాకు అంతరాయం**

**వాస్తవం : మనోహరాబాద్:**



మనోహరాబాద్ మండలంలోని 132/33 కేవీ మనోహరాబాద్ సబ్‌స్టేషన్ నుంచి వచ్చే 33 కేవీ కాళ్లకల్ ఇండస్ట్రియల్ ఫీడర్,33 కేవీ సీతారామ ఫీడర్ల పరిధిలో ఆదివారం చెట్ల కొమ్మల తొలగింపు పనులు చేపట్టనున్నట్లు విద్యుత్ శాఖ కాళ్లకల్ ఏఈ రాజ్‌కుమార్ శనివారం తెలిపారు.విద్యుత్ లైన్లకు అడ్డుగా పెరిగిన చెట్ల కొమ్మల కారణంగా విద్యుత్ సరఫరాలో అంతరాయం కలగకుండా ముందస్తు చర్యల్లో భాగంగా ఈ పనులు చేపడుతున్నట్లు ఆయన పేర్కొన్నారు.పనుల సమయంలో సంబంధిత ఫీడర్లను నిలిపివేయాల్సి ఉండటంతో పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని తెలిపారు.ఈ కారణంగా ముప్పిరెడ్డిపల్లి సబ్‌స్టేషన్ పరిధిలోని గృహ విద్యుత్ వినియోగదారులు, పరిశ్రమలకు,అలాగే కొండాపూర్ సబ్‌స్టేషన్ పరిధిలోని పరిశ్రమలకు ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిచిపోనుంది.చెట్ల కొమ్మల తొలగింపు పనులు పూర్తయిన అనంతరం విద్యుత్ సరఫరాను పునరుద్ధరించనున్నట్లు అధికారులు తెలిపారు.విద్యుత్ సరఫరా నిలిచిపోయే సమయాన్ని వినియోగదారులు గమనించి,అవసరమైన ముందస్తు ఏర్పాట్లు చేసుకోవాలని సూచించారు.పనులు సజావుగా,త్వరగా పూర్తయ్యేందుకు వినియోగదారులు విద్యుత్ శాఖ సిబ్బందికి సహకరించాలని కాళ్లకల్ ఏఈ రాజ్‌కుమార్ కోరారు.

## కేంద్ర ప్రభుత్వ నిధులు ఎన్ని వచ్చాయి.. ఖర్చు ఎంత?



**వాస్తవం : ఎల్లారెడ్డిపేట**

ఎల్లారెడ్డిపేట మేజర్ గ్రామపంచాయతీకి కేంద్ర ప్రభుత్వం నుంచి వచ్చిన 15వ, 16వ ఆర్థిక సంఘం నిధులు ఎన్ని? వాటిని ఏయే అభివృద్ధి పనులకు ఎంత మేరకు ఖర్చు చేశారు? అనే వివరాలను ప్రజలకు వెల్లడించాలని భారతీయ జనతా పార్టీ ఎల్లారెడ్డిపేట మండల శాఖ నాయకులు కోరారు.ఈ మేరకు గ్రామపంచాయతీ కార్యదర్శి కృష్ణను కలిసి వినతిపత్రం అందజేశారు. గ్రామపంచాయతీ పరిధిలోని లే అవుట్ భూములు, రిజిస్ట్రేషన్ చేసిన ప్లాట్ల వివరాలతో పాటు ఆయా లేఅవుట్లలో గ్రామ పంచాయతీకి వచ్చిన ప్లాట్ల సంఖ్య, వాటికి సంబంధించిన రికార్డులను వెల్లడించాలని కోరారు. ఈ కార్యక్రమంలో చందుపట్ల లక్ష్మారెడ్డి, నేవూరి శ్రీనివాస్‌రెడ్డి, వార్డు మెంబర్ గంట బాలకృష్ణ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# సనుగులలో రైతులకు శిక్షణ



**వాస్తవం : చందుర్తి**

చందుర్తి మండలం సనుగుల గ్రామంలో శనివారం వ్యవసాయ సాంకేతిక యాజమాన్య సంస్థ ఆధ్వర్యంలో గ్రామ సర్పంచ్ బొడిగే లావణ్య-అనిల్ అధ్యక్షతన రైతులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు.ప్రస్తుత కాలంలో వాతావరణంలో వస్తున్న అనూహ్య మార్పులు, వర్షపాతం లోపం, లేదా అధిక వర్షాలు, ఉష్ణోగ్రతల పెరుగుదల, నీటి లభ్యతలో మార్పులు తదితర అంశాలు వ్యవసాయంపై తీవ్ర ప్రభావం చూపుతున్న నేపథ్యంలో, రైతులు వాతావరణ మార్పులకు అనుగుణంగా సాగు పద్ధతులను మార్చుకోవాల్సిన అవసరాన్ని వివరించారు.వాతావరణ పరిస్థితులను ఎప్పటికప్పుడు గమనిస్తూ వ్యవసాయ శాఖ అధికారులు, శాస్త్రవేత్తల సూచనలను పాటించాలని రైతులకు సూచించారు.ఈ కార్యక్రమంలో చందుర్తి మండల వ్యవ సాయ అధికారి సిహెచ్ దుర్గరాజు, ఆత్మ కమిటీ చైర్మన్ ముస్కు ముకుంద రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ చెలుకల తిరుపతి, రైతు విజ్ఞాన కేంద్రం కోఆర్డినేటర్ సాయి కుమార్,ఏ ఈ ఓ శారద, రైతులు పాల్గొన్నారు.

**పెండింగ్లో ఉన్న ఫీజు రియంబర్స్మెంట్, స్కాలర్షిప్‌లను**

# వెంటనే విడుదల చేయాలి




**వాస్తవం : చెన్నూర్ ఆర్సి**

యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీ పేరుతో రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన జీవో నెం. 97ను తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ పిడిఎస్ యు విద్యార్థి సంఘం ఆధ్వర్యంలో మంచిర్యాల జిల్లా చెన్నూర్ పట్టణ కేంద్రంలో విద్యార్థులు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా పిడిఎస్‌యు జిల్లా ఉపాధ్యక్షులు పి.సికిందర్ మాట్లాడుతూ...తెలంగాణ ప్రభుత్వం తీసుకొచ్చిన శక్తి స్కీం, జీవో నెం. 97 కారణంగా తమ విద్యా భవిష్యత్తు తీవ్రంగా ప్రభావితమవుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. పాలిటెక్నిక్ డిప్లొమా పూర్తి చేసిన తర్వాత ఇంజినీరింగ్‌లో ఉన్నత విద్య అభ్యసించాలనుకునే విద్యార్థులు, తాజా నిర్ణయాల వల్ల మళ్లీ ఇంటర్మీడియట్ చదవాల్సిన పరిస్థితి ఏర్పడుతుందని తెలిపారు. దీనివల్ల తమ విలువైన మూడు సంవత్సరాల విద్యా కాలం వృథా అయ్యే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. తక్షణమే జీవో నెం. 97ను రద్దు చేసి పాలిటెక్నిక్ విద్యార్థులకు న్యాయం చేయాలని పి డి ఎస్ యు డిమాండ్ చేసింది. ఈ కార్యక్రమంలో పిడిఎస్ యు నాయకులు పవన్, కిరణ్, రవితేజ, రమ్య, మమత, కీర్తన తదితరులు పాల్గొన్నారు.

# సమాజ నిర్మాణంలో ఉపాధ్యాయుల పాత్ర కీలకం

### ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు

**వాస్తవం : భూపాలపల్లి**



సమాజ నిర్మాణంలో ఉపాధ్యాయుల పాత్ర అత్యంత కీలకమని, విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దడంలో వారి సేవలు ఎనలేనివని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు పేర్కొన్నారు. ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం సమగ్ర జిల్లా కార్యాలయాల ప్రాంగణ (ఐడిఓసి) సమావేశ మందిరంలో విద్యాశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన సన్మాన మహోత్సవంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మతో కలిసి డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. గురువును మించిన దైవం లేదని, విద్యార్థులు ఉన్నత స్థాయికి ఎదుగడానికి ఉపాధ్యాయుల మార్గదర్శకత్వమే కారణమన్నారు. తన చిన్నతనంలో ఘన్‌పూర్ ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయుడు గోపాల్‌రావు ఉచితంగా శిక్షణ (ట్యూషన్) ఇవ్వడం, సామాజిక సంక్షేమ వసతిగృహంలో (సోషల్ వెల్ఫేర్ హాస్టల్) చదువుకోవడం వల్లనే తాను ఈ రోజు ప్రజా ప్రతినిధిగా ఈ స్థాయిలో ఉన్నానని గుర్తుచేసుకున్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాయకత్వంలో 11 వేలకుపైగా ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేశామని, ప్రభుత్వ పాఠశా లల్లో ఆంగ్ల మాధ్యమ బోధన, మధ్యాహ్న భోజనం వంటి సౌకర్యాలు కల్పిస్తున్నందున విద్యార్థుల సంఖ్య పెంచేం దుకు ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు. జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ మాట్లాడుతూ.. విద్యార్థులలో క్రమ శిక్షణ, నైతిక విలువలు పెంపొందించడంలో ఉపాధ్యా యులు కీలకమని పేర్కొన్నారు. తన తండ్రి కళాశాల ప్రధానోపాధ్యాయుడిగా (ప్రిన్సిపల్), తల్లి ఉపన్యాసకురాలిగా (లెక్చరర్) పనిచేశారని, తాను కూడా ఉపాధ్యాయ కుటుంబం నుంచి వచ్చినందుకు గర్విస్తున్నానని తెలి పారు. అనంతరం విద్యాబోధనలో విశేష సేవలు అందిం చిన ఉత్తమ ఉపా ధ్యాయులను శాలువాలు, జ్ఞాపికలతో ఘనంగా సన్మా నించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ విజయ లక్ష్మి, జిల్లా గ్రంథాలయ సంస్థ అధ్యక్షుడు రాజబాబు, జిల్లా విద్యా శాఖ అధికారి లలిత, పురపాలక అధ్యక్షుడు బుర్రా కొమురయ్య, ఉపాధ్యక్షుడు అంబాల శ్రీనివాస్, పలువురు అధికారులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను ప్రారంభించిన ఏఎంసీ చైర్మన్, సెస్ డైరెక్టర్



**వాస్తవం : ఎల్లారెడ్డిపేట**

ఎల్లారెడ్డిపేట మండలం నారాయణపురం గ్రామంలోని 11వ వార్డులో నూతనంగా ఏర్పాటు చేసిన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను శనివారం ఏఎంసీ మార్కెట్ కమిటీ చైర్మన్ షేక్ సబేరా బేగం గౌస్, సెస్ డైరెక్టర్ వరుస కృష్ణాహరి కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా సెస్ అధికారులు మాట్లాడుతూ.. 11వ వార్డులో విద్యుత్ వినియోగ భారం పెరగడంతో గతంలో లోవోల్టేజీ సమస్య ఏర్పడేదని తెలిపారు. నూతన ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేయడంతో విద్యుత్ భారం తగ్గడంతో పాటు, ఈ ప్రాంతంలోని గృహ వినియోగదారులకు లోవోల్టేజీ సమస్య పరిష్కారమవుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ దొమ్మటి నరసయ్య, సింగిల్ విండో అధ్యక్షుడు గుండారపు కృష్ణారెడ్డి, ఏఎంసీ వైస్ చైర్మన్ గుండాడి రామ్‌రెడ్డి, రాజన్నపేట సర్పంచ్ కల్లూరి బాపూరెడ్డి, ఉప సర్పంచ్ మధుసూదన్‌రెడ్డి, వార్డు సభ్యులు షేక్ సమద్, గణేష్, దివ్యభారతి, మండల కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షుడు సద్ది లక్ష్మారెడ్డి, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు సుడిది రాజేందర్,విద్యుత్ సిబ్బంది పాల్గొన్నారు.

# 22ఏ నిషేధిత జాబితా భూములపై సర్కారు స్పష్టమైన హామీ ఇవ్వాలి

### మండలంలో ప్రోహిబిటెడ్ భూములయిఅ యథేచ్ఛగా పట్టాలు

### బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు పాకాల మహిపాల్ రెడ్డి

**వాస్తవం : బెజ్జంకి**



22 ఎ నిషేధిత భూముల జాబితా పై ప్రభుత్వం స్పష్టమైన హామీ ఇవ్వాలని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు పాకాల మహిపాల్ రెడ్డి డిమాండ్ చేశారు. శనివారం బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ 22ఏ జాబితాను ప్రభుత్వం పరిష్కార మార్గం చూపకుండా జాప్యం చేస్తుందని ,ప్రశ్నిస్తే ప్రభుత్వం డైవర్షన్ రాజకీయాలు చేస్తున్నదని అరోపించారు. 22ఏ నిషేధిత జాబితా ద్వారా కాంగ్రెస్ ప్రభుత్వం భూ దందాలు,అవినీతికి తెరలేపారని, క్లియరెన్స్ పేరిట సామాన్యులకు ఇబ్బందులకు గురి చేస్తుందని విమర్శించారు. సర్వే నంబర్ 386లో ఎన్ఓసి వచ్చి మాజీ సర్వీస్ మెన్ మిలిటరీకి ఇచ్చిన భూములు కూడా నిషేధిత జాబితాలో చేర్చారని ఆ పాపం కాంగ్రెస్‌దే అని అన్నారు. మండలంలోని కొన్ని గ్రామాల్లో నిషేధిత జాబితాలో భూములు చేర్చడం వల్ల సామాన్య రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. గుగ్గిళ్ళ, పోతారం గ్రామాల్లోని సర్వే నంబర్ 96 లో సుమారు 300 ఎకరాల భూమి ఉంటే అందులో ఇథనాల్ ఫ్యాక్టరీ వైట్ ఫీల్డ్, గ్రీన్ ఫీల్డ్ లకు చెందిన 17 ఎకరాల భూమిని ప్రాహిబిటెడ్ లిస్ట్‌లో లేదని వారికి మాత్రం రిజిస్ట్రేషన్ చేశారని వైట్ ఫీల్డ్‌లో బీరు ఫ్యాక్టరికి, లిక్కర్ ఫ్యాక్టరీకి అనుమతుల కోసం టిఎస్ఐపాస్‌లో అప్లై పెట్టుకున్నారని స్పష్టం చేశారు. వైట్ ఫీల్డ్ లో లిక్కర్ ఫ్యాక్టరీకి అనుమతులు ఇస్తే రాజీవ్ రహదారిని దిబ్బందించి బిఆర్ఎస్ ఆధ్వర్యంలో ధర్నా చేస్తామని, ఇప్పటికే ఈ గ్రీన్ ఫీల్డ్, వైట్ ఫీల్డ్ ఇతనల్ ఫ్యాక్టరీల వల్ల ప్రజలు ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొం టున్నారని ఆరోపించారు. బెజ్జంకి మండలంలోని ముత్తన్నపేట గ్రామంలో సర్వే నంబర్ 559 లో ప్రస్తుత తహసీల్దార్ శ్రీకాంత్ భూమి ప్రోహిబిటెడ్‌లో ఉన్న రిజిస్ట్రేషన్‌లు చేశారని ఆరోపించారు. సామాన్య ప్రజలకు ఒక న్యాయం, కాంగ్రెస్ పెద్దలకు ఒక న్యాయమా? అని ప్రశ్నించారు. ఎటువంటి ముందస్తు వెరిఫికేషన్ లేకుండానే వేలాది నివాస గృహాలను, ప్రైవేటు పట్టా భూము లను, వ్యవసాయ భూములను నిషేధిత జాబితాలో చేర్చి సామాన్య ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తోందని విమ ర్శించారు. సీనియర్ నాయకులు లింగాల లక్ష్మణ్ మాట్లా డుతూ రిజిస్ట్రేషన్లు, పట్టాలు, రుణాలు వంటి అవసరాల కోసం ఏండ్లుగా ఎదురుచూస్తున్న సామా న్యులకు, ప్రభుత్వ యంత్రాంగం అనుమతుల విధానం శాపంగా మారిందన్నారు . సొంత సంస్థలు జారీ చేసిన అనుమతులను మరిచిన సర్కార్, ఆ భారాన్ని ప్రజల నెత్తి న వేసిందని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ బొల్లం శ్రీధర్ పెద్దన్న, ఉప సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షులు దిటి బాలనర్సు, ఉప సర్పంచ్ దుమాల మహేష్, సోషల్ మీడియా ఇంచార్జీ ఎల శేఖర్ బాబు, పట్టణ అధ్య క్షులు వంగల నరేశ్, నిమ్మ వెంకట నర్సయ్య, రాగుల మహేష్, మాశం బాబు, కనగండ్ల శంకర్ పాల్గొన్నారు.

## పార్టీ ఫిరాయింపులపై హైకోర్టు తీర్పు కీలకం

### నాయిని ఉదయ్ రంజన్ గౌడ్

**వాస్తవం : మనోహరాబాద్ :**



పార్టీ ఫిరాయింపుల అంశంలో హైకోర్టు ఇచ్చిన తీర్పు ప్రజాస్వామ్య వ్యవస్థలో కీలక పరిణామమని బీఆర్ఎస్ నాయకులు నాయిని ఉదయ్ రంజన్ గౌడ్ అన్నారు. దానం నాగేందర్ అనర్హతకు సంబంధించి వెలువడిన తీర్పు పార్టీ మారే ప్రజాప్రతి నిధులకు స్పష్టమైన సంకేతాన్ని ఇచ్చిందని పేర్కొన్నారు. బీఆర్ఎస్ నుంచి ఖైరతాబాద్ ఎమ్మెల్యేగా గెలిచిన దానం నాగేందర్ అనంతరం కాంగ్రెస్ పార్టీలో చేరి,సికింద్రాబాద్ పార్లమెంట్ స్థానానికి కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేశారని నాయిని తెలిపారు. ఈ పరిణా మాల నేపథ్యంలో ఆయన అనర్హతపై హైకోర్టు తీర్పు రావడం ప్రాధాన్యత సంతరించుకుందని అన్నారు. పార్టీ ఫిరాయింపుల విషయంలో రాజ్యాంగ నిబంధనలు, చట్ట పరమైన ప్రక్రియను కచ్చితంగా అమలు చేయాల్సిన బాధ్యత ప్రజాప్రతినిధులు, సభా పతులపై ఉందని ఆయన పేర్కొన్నారు. హైకోర్టు తీర్పుతో ఈ అంశంపై మరింత స్పష్టత వచ్చిందని అన్నారు. బీఆర్ఎస్ నుంచి ఎన్నికై కాంగ్రెస్‌లో చేరిన ఇతర ఎమ్మెల్యేల విషయంలోనూ స్పీకర్ రాజ్యాంగబద్ధంగా నిర్ణయం తీసుకోవాలని నాయిని ఉదయ్ రంజన్ గౌడ్ డిమాండ్ చేశారు. పార్టీ ఫిరాయింపులపై ప్రజాస్వా మ్య విలువ లను,రాజ్యాంగ స్ఫూర్తిని కాపాడేలా చర్యలు ఉండాలని ఆయన కోరారు.

## రేగుల పల్లెలో సీసీ కెమెరాలు ప్రారంభం




**వాస్తవం : బెజ్జంకి సెప్టెంబర్ 19**

బెజ్జంకి మండలంలోని రేగులపల్లె గ్రామంలో సురక్షనేత్ర కార్యక్రమంలో భాగంగా శనివారం సీసీ కెమెరాలు ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి సిద్దిపేట రూరల్ సీఐ హాజరై మాట్లాడుతూ గ్రామాలలో నేరాల నియంత్రణకు, ప్రజల రక్షణకు సీసీ కెమెరాలు ఎంతో దోహదపడతాయని స్పష్టం చేశారు. ఒక్క సీసీ కెమెరా 100 మందితో సమానమని పేర్కొన్నారు. సీసీ కెమెరాలు ఏర్పాటు చేయడం వల్ల నేరస్తులను జాప్యం లేకుండా గుర్తించ్చవచ్చని తెలిపారు. సీసీ కెమెరాలతో నేరాల నియంత్ర ణను అదుపు చేయవచ్చన్నారు. మండలంలోని ప్రతి గ్రామంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసేందుకు ఆయా గ్రామాల ప్రజలు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ తోట తిరుపతి, పోలీస్ సిబ్బంది, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# మాదిగ సంఘం స్థలానికి నష్టపరిహారం అందించాలి

### మంత్రి శ్రీధర్ బాబు దృష్టికి తీసుకెళ్లాలని తొట్ల తిరుపతి యాదవ్‌కు వినతి

**వాస్తవం : రామగిరి:**



శనివారం రామగిరి మండలం బేగంపేట్ క్రాస్ రోడ్‌లోని మంథని బ్లాక్ కాంగ్రెస్ కార్యాలయంలో మంథని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు తొట్ల తిరుపతి యాదవ్‌ను రత్నాపూర్ మాదిగ సంఘం నాయకులు,మహిళలు కలిసి వినతిపత్రం అందజేశారు. రత్నాపూర్ గ్రామం మేడిపల్లి శివారు ప్రాంతంలోని సర్వే నంబర్లు 135,136లో గల భూమిని కోకాకోలా ఇండస్ట్రియల్ పార్క్ ఏర్పాటు కోసం భూసేకరణ నిమిత్తం తీసుకోవడం జరిగిందని మాదిగ సంఘం నాయకులు తెలిపారు. సర్వే నంబర్లు 135, 136లోని భూమిపై తమ మాదిగ కుల సంఘానికి చెందిన సభ్యులు గత 50 సంవత్సరాలుగా జీవనోపాధి పొందుతూ వస్తున్నారని తెలిపారు. భూసేకరణ కారణంగా తమ సంఘ సభ్యుల జీవనోపాధికి నష్టం కలుగుతున్నందున తమకు తగిన నష్టపరిహారం అందించాలని కోరారు. అసైన్డ్ భూములకు ఏ విధంగా నష్టపరిహారం అందిస్తున్నారో,అదే విధంగా తమ సంఘానికి కేటా యించిన భూమికి కూడా తగిన నష్టపరిహారం అందించి న్యాయం చేయాలని వారు విజ్ఞప్తి చేశారు. తమ సమస్యను తెలంగాణ రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు దృష్టికి తీసుకెళ్లి,తగిన న్యాయం జరిగేలా చూడాలని మంథని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు తొట్ల తిరుపతి యాదవ్‌ను కోరారు. ఈ సందర్భంగా తొట్ల తిరుపతి యాదవ్ రత్నాపూర్ మాదిగ సంఘం నాయ కులు, మహిళలు తెలిపిన సమస్యను మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు దృష్టికి తీసుకెళ్లి, సమస్య పరిష్కారానికి తన వంతు కృషి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ ఆరెల్లి దేవక్క,కొమురయ్య గౌడ్,రామగిరి మండల కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ అధ్యక్షులు కండె పోషం,మాజీ జెడ్పీటీసీ మైదం వరప్రసాద్,మట్ట రాజ్ కుమార్,బర్ల శ్రీకాంత్,భోగే ప్రకాష్,అధ్యక్షులు కండె గట్ట య్య ,ఉపాధ్యక్షులు బెజ్జల రాములు,బెజ్జల సంజీవ్ కొడారి సది,వార్డ్ సభ్యులు కండె సాహితి,కండె లక్ష్మి పాల్గొన్నారు.

## రోబో టీచర్-తల్లిదండ్రుల సమావేశం



**వాస్తవం : సిరిసిల్ల**

సిరిసిల్ల పట్టణంలోని గీతానగర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం తల్లిదండ్రుల సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ప్రత్యేక ఆకర్షణగా రోబో టీచర్ నిలిచింది. మొదట విద్యార్థుల ప్రగతి సాధించవలసిన సామర్థ్యాల గురించి పాఠశాల ప్రధానోపాధ్యాయులు శారదా వివరించగా ఉపాధ్యాలు మైలారం తిరుపతి, రాజలింగం, భూపాల్ రెడ్డి, తిరుపతి,స్వప్న, విమోచన,అర్చన, మంజుల తదితరులు విద్యార్థుల సమస్యలు,భవిష్యత్ పరణాళికపై వివరించారు. ఈ కార్యక్రమంలో తల్లిదండ్రులు అడిగిన ప్రశ్నలకి సమాధానాలు ఇచ్చింది సందేహాలను నివృత్తి చేశారు. రోబోతో తల్లిదండ్రులు నేరుగా మాట్లాడటం పట్ల సంతృప్తి వ్యక్తం చేశారు. ఇండస్ ల్యాబ్ వారు పాఠశాలకు రోబో టీచర్‌ను ప్రదానం చేసిన విషయం విదితమే. ఇది తెలంగాణలోనే ప్రభుత్వ పాఠశాలలో మొదటి రోబో టీచర్.

## ఎస్‌జిఎఫ్ క్రీడలకు బాలాజీ స్కూల్ విద్యార్థుల ఎంపిక

**వాస్తవం : భూపాలపల్లి**

భూపాలపల్లి అంబేద్కర్ స్టేడియంలో నిర్వహించిన ఎస్‌జిఎఫ్ మండల స్థాయి క్రీడా పోటీల్లో బాలాజీ ఇంటిగ్రేటెడ్ టీచింగ్ స్కూల్ విద్యార్థులు ప్రతిభ చాటారు. అండర్-14, 17 విభాగాల్లో కబడ్డీ, ఖో-ఖో, వాలీబాల్ పోటీలకు ఎం.శ్రీనిహా, జి.సాత్విక, జి.సాయి మనస్విని, షేక్ సన, ఏ.సుశాంత్, ఏ.అశ్వత్, జి.విష్ణు, పి.సాయి చరణ్ ఎంపికయ్యారని ప్రిన్సిపల్ రజనీకాంత్ తెలిపారు. ఎంపికైన విద్యార్థులను బాలాజీ విద్యా సంస్థల చైర్మన్ డాక్టర్ ఏ. రాజేంద్రప్రసాద్ రెడ్డి ఫోన్ ద్వారా అభినందించారు. క్రీడాకారులను ప్రోత్సహించిన తల్లిదండ్రులకు, శిక్షణ ఇచ్చిన వ్యాయామ ఉపాధ్యాయులు సాంబరాజు, శ్రీధర్‌లకు ప్రిన్సిపల్ ధన్యవాదాలు తెలిపారు.



వాస్తవం



# మాదిగలపై అరాచకాలను నిరసిస్తూ ఉద్యమం చేస్తాం

**అక్షిత మృతికి కారకులను వెంటనే అరెస్టు చేయాలి**
**మాదిగ మహాశక్తి రాష్ట్ర నేత ఆసంపల్లి శ్రీనివాస్**

**వాస్తవం : గోదావరిఖని**



మాదిగ జాతులపై జరుగుతున్న దాడులు, అరాచకాలు, అఘాయిత్యాలకు వ్యతిరేకంగా అతి త్వరలోనే రాష్ట్రవ్యాప్త ఉద్యమం చేపడతామని మాదిగ మహాశక్తి తెలంగాణ కోర్ కమిటీ సభ్యుడు ఆసంపల్లి శ్రీనివాస్ స్పష్టం చేశారు. శనివారం పెద్దపల్లి జిల్లా గోదావరిఖని ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆసంపల్లి శ్రీనివాస్ మాట్లాడుతూ గోదావరిఖని పారిశ్రామిక ప్రాంతానికి చెందిన ఇంజనీరింగ్ విద్యార్థిని తాండ్ర అక్షిత రాణి ఆత్మహత్యకు కారకులను వెంటనే అరెస్టు చేయాలని డిమాండ్ చేస్తూ... నిందితులను అరెస్టు చేయడంలో జరుగుతున్న జాప్యం పై మండిపడ్డారు వేధింపుల మూలంగానే ఆత్మహత్య చేసుకుంటున్నట్లు అక్షిత సూసైడ్ నోట్ కూడా రాసినప్పటికీ కారకులను ఇప్పటివరకు అరెస్టు చేయకపోవడంను ఎంతవరకు సమంజసం అన్నారు అక్షిత మృతికి కారకులైన ప్రతి ఒక్కరిని అరెస్టు చేయాలన్నారు దళిత జాతి బిడ్డ అక్షిత ఆత్మహత్య సంఘటనపై ఇప్పటివరకు పెద్దపల్లి పార్లమెంటు సభ్యుడు రామగుండం శాసన సభ్యులు ఎవరు కూడా మాట్లాడకపోవడం అన్యాయం అన్నారు అక్షిత కుటుంబానికి ప్రభుత్వం అండగా నిలుస్తూ కోటి రూపాయల పరిహారాన్ని ఇవ్వాలని డిమాండ్ చేశారు అదేవిధంగా రామగుండం ఏరియాలోని సింగరేణి బొగ్గు గనులు పనిచేస్తున్న మహిళలపై వేధింపులు ఎక్కువవుతున్నాయని ఆరోపించారు. అక్షిత కుటుంబానికి న్యాయం జరిగేంత వరకు మాదిగ మహాశక్తి ముందుండి పోరాటం చేస్తుందని శ్రీనివాస్ పేర్కొన్నారు ఈ సంఘటనను రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకెళ్తామని మాసంపల్లి శ్రీనివాస్ చెప్పారు. విలేకరుల సమావేశంలో మాదిగ మహాశక్తి ప్రతినిధులు స్వప్న, కుక్క కనకరాజు, ఆసంపల్లి రవీందర్ , నాతరి ఆదిత్య, పోయిల సాగర్, కుక్క అశోక్ తదితరులు పాల్గొన్నారు.

# ఆర్పీఎఫ్ కానిస్టేబుల్‌ను సస్పెండ్ చేయాలి

**బహుజన సంగారెడ్డి జిల్లా కార్యదర్శి ప్రసాద్**

**వాస్తవం : అందోల్**

ఓ మహిళపై దాడి చేసి జుట్టు పట్టుకొని ఈడ్చుకెళ్ళడం చాలా దారుణం అని మానవ హక్కుల ఉల్లంఘనపై కఠిన చర్యలు తీసుకోవాలని బహుజన సంగారెడ్డి జిల్లా కార్యదర్శి ప్రసాద్ డిమాండ్ చేశారు. మహిళపై దాడి చేయడమే కాకుండా నడి రోడ్డు మీద జుట్టు పట్టుకొని ఈడ్చుకెళ్లడం చాలా దారుణమని అన్నారు. చట్టాన్ని కాపాడాల్సిన బాధ్యతాయుతమైన సిబ్బందే చట్టాన్ని చేతుల్లోకి తీసుకోకుంటే ఇక ప్రజలకు న్యాయం ఎలా జరుగుతుందని హెచ్చరించారు. హైద్రాబాద్ లోని హాఫీజ్పేట్ లో మహిళపై దాడి చేయడం అత్యంత క్రూరత్వం అని రక్షకులైన అధికార పోలీస్ యంత్రాంగం మహిళలపై ఇలాంటి అఘాయిత్యాలు చేయడం సబబు కాదన్నారు. ఈ ఘటనపై పై అధికారులు వెంటనే స్పందించి ఆర్పీఎఫ్ పోలీస్ కానిస్టేబుల్ ను విధులనుండి తక్షణమే సస్పెండ్ చేయాలని చట్టపరమైన చర్యలు తీసుకొని అవసరమైతే సర్వీస్ నుండి తొలగించాలని డిమాండ్ చేశారు.. ఈ కార్యక్రమంలో సంగారెడ్డి జిల్లా అధ్యక్షులు మిద్దెల గాల్ రెడ్డిజిల్లా కార్యదర్శి బహుజన ప్రసాద్ ,ధన్రాజీ శ్రీనివాస్‌లు పాల్గొన్నారు.



# కష్టాల కడలిలో కాసిపేట వాసులు

**క్షణం ఒక గండం దినం ఒక రోగంగా మారిన బతుకులు**
**కేకే ఓ సి కరుణిస్తుందా..? లేదా కాటేస్తుందా..?**
**భూములిచ్చి తమ గోతులు తామే తవ్వుకున్నామా అనే బాధలో జనాలు**

**వాస్తవం : కాసిపేట**



మంచిర్యాల జిల్లా కాసిపేట మండలంలోని సోమగూడెం గ్రామ ప్రజల కష్టాలు తీర లేకుండా ఉన్నాయి. గత కొన్ని సంవత్సరాలుగా కేకే ఓసిలో జరిగే బ్లాస్టింగ్ వలన కేకే ఓసీ చుట్టుపక్కల గ్రా మాల ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురి అవుతు న్నారు. బ్లాస్టింగ్ జరిగిన ప్రతిసారి భూమి తీవ్రంగా కంపించి తమ ఇండ్ల గోడలు కూలిపోయి వస్తువులు కింద పడి పగిలిపోయి బ్లాస్టింగ్ పిదప వచ్చి నటువంటి దుమ్ము ధూళి భయంకరమైన వాసన వలన ప్రజలు తీవ్ర అస్వస్థతకు గురి అవుతున్నామని ఈ విషయమై కేకే ఓసి మరియు సింగరేణి యాజమాన్యాలకు ఎన్నిసార్లు తమ బాధను విన్న వించుకున్న ఉపయోగం లేకపోయిందన్నారు. ఇక ఉపేక్షిస్తే తమ ప్రాణాలకే ముప్పు వాటిల్లుతుందన్న భయంతో శనివారం రోజు కాసిపేట మండలం సోమగూడెం (కె) గ్రామంలోని ట్యాంక్ బస్తి, ఎస్టీ ఆర్ కాలనీ వాసులు తమకు రక్షణ కల్పించి తమ ప్రాణాలను కాపాడాలని, భూ సేకరణ చట్టం 2013 ప్రకారం ఆర్అండ్ ఆర్ ప్యాకేజీ ఇవ్వాలని కోరుతూ బెల్లంపల్లి సబ్ కలెక్టర్ కార్యాలయంలోని ఏవో వీణ ఖాదర్‌కి సర్పంచ్ కునుసోత్ చైతన్య ఆధ్వర్యంలో వినతి పత్రం అందించారు.

# లొంకకేసారం విఓ బిల్డింగ్ నిర్మాణానికి మార్కింగ్

**వాస్తవం : రామగిరి:**

రామగిరి మండలంలో నిర్వహించిన మండల స్థాయి సమీక్షా సమావేశానికి జిల్లా కలెక్టర్ ముఖ్య అతిథిగా విచ్చేసి,వివిధ శాఖల పనితీరు,అభివృద్ధి కార్యక్రమాలు,ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలుపై సమగ్రంగా సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా విఓ బిల్డింగ్ నిర్మాణం కు సంభందించి పాత పాఠశాల ఆవరణలో ఖాళీ స్థలంలో నిర్మాణం చేయుటకు అనుమతించాల్సిందిగా లొంకకేసారం సర్పంచ్ కోరగా అదే స్థలంలో బిల్డింగ్ నిర్మాణం మొదలు పెట్టాల్సిందిగా శుక్రవారం ఏఇపిఆర్ వరలక్ష్మిని కలెక్టర్ ఆదేశించగా, శనివారం లొంకకేసారం గ్రామ పంచాయతీ పరిధిలో విఓ బిల్డింగ్ నిర్మాణానికి మార్కింగ్ ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఎంపీ డీఓ శైలజ రాణి,సర్పంచ్ వీరగోని రమాదేవి శ్రీని వాస్,ఏఈ పిఆర్ వరలక్ష్మి,ఏపిఎండి. పద్మ, పంచాయతీ సెక్రటరీ మహేందర్, ఉప సర్పంచ్, విఓ అధ్యక్షురాలు, వార్డుసభ్యులు పాల్గొన్నారు.



# చందుర్తి, సనుగుల సింగిల్ విండోల నూతన పాలక వర్గాలు

**ఉత్తర్వులు జారీ చేసిన అధికారులు**

**వాస్తవం : చందుర్తి**



చందుర్తి, సనుగుల సహకార సంస్థలకు నూతన పాలకవర్గాన్ని రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించింది. చందుర్తి చైర్‌పర్సన్‌గా గసికంటి ప్రభాకర్‌ను,సనుగుల చైర్‌పర్సన్‌గా ఏగోళం శ్రీనివాస్‌ను నియమించగా సభ్యులుగా మరో 12 మందిని నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. చందుర్తి పాలకవర్గ సభ్యులుగా మెడికల తిరుపతి, పసుల కాంతవ్వ, మానుపాటి ఎల్లయ్య (పెద్ద), దొంగరి భూమయ్య, వట్టెముల కిష్టయ్య, మల్యాల నర్సయ్య, బొద్దు శంకర్, రామిడి మల్లయ్య, నలుమాసు మహేందర్, చిలుక త్రిభువన్, కాసరపు శ్రీనివాస్, లాండే సుజాతలను, సనుగుల పాలకవర్గ సభ్యులుగా తర్రె మనోహర్, అజ్మీరా గణేష్, ఎందూరి సాయి రెడ్డి, దర్న మల్లేశం, తర్రె లక్ష్మి, బొంత సురేందర్ రావు, సనుగుల గంగాధర్, మెంగాని భూమయ్య, గడ్డం అనిల్, ఉగిలే శ్రీనివాస్, నల్ల ఆనంద రెడ్డి, బనాల లక్ష్మిలను నియమించారు. నూతనంగా నియమితులైన చైర్‌పర్సన్, పాలకవర్గ సభ్యులు తమపై నమ్మకం ఉంచి బాధ్యతలు అప్పగించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి,మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్‌లకు కృతజ్ఞతలు తెలిపారు.

# చర్లకు ఊపిరి పోసిన మనోహర్ ప్రసాద్

**మండలానికి రూ.60 వేల విలువైన ఆక్సిజన్ కాన్సంట్రేటర్ అందజేత**

**వాస్తవం : చర్ల**



పుట్టిన ఊరి రుణం తీర్చుకోవాలనే సంకల్పంతో చర్ల మండల ప్రజలకు నిత్యం సేవలందిస్తున్న ప్రముఖ దాత పరుచూరి మనోహర్ ప్రసాద్ మరోసారి తన దాతృత్వాన్ని చాటుకున్నారు. గతంలో పాఠశాలలకు బల్లలు, కుర్చీలు, విద్యార్థు లకు పుస్తకాలు, స్టేషనరీ, వారాంతపు అన్నదానాలు, వాల్ ఆఫ్ కైండ్ నెస్, పేద రోగులకు ఆర్థిక సహాయం వంటి ఎన్నో సేవా కార్యక్రమాలను 'మీకోసం మేమున్నాం' టీం ఆధ్వర్యంలో చేపట్టిన సంగతి తెలిసిందే. అందులో భాగంగా శనివారం తన బంధువులైన అట్లూరి అనుపమ (తిమ్మాపురం, పశ్చిమ గోదావరి జిల్లా, ఏపీ), దివంగత గరిమెళ్ల కృష్ణార్జునరావు జ్ఞాపకార్థం సుమారు రూ. 60,000 విలువగల ఆక్సిజన్ కాన్సంట్రేటర్ మిషన్‌ను 'మీకోసం మేమున్నాం' సంస్థకు స్పాన్సర్‌గా అందజేశారు. ఈ సందర్భంగా సంస్థ చైర్మన్ లయన్ నీలి ప్రకాష్ మాట్లాడుతూ.. దాతలు పరుచూరి మనోహర్ ప్రసాద్ కుటుంబానికి, అట్లూరి అనుపమ కుటుంబానికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ ఆక్సిజన్ కాన్సంట్రేటర్‌ను మండలంలోని దీర్ఘకాలిక శ్వాసకోశ వ్యాధిగ్రస్తుల సహాయార్థం 24/7 అందుబాటులో ఉంచుతామని, వైద్యుల సలహా మేరకు ఇంటి వద్ద వినియోగించుకోవాల్సిన అవసరం ఉన్నవారు తమ సంస్థను సంప్రదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పరుచూరి మనోహర్ ప్రసాద్, గొట్టిపాటి శ్రీనివాసరావు, దొడ్డి సూరిబాబు, గుమ్మడి హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# రత్నాపూర్‌లో వీ.బి.జి. రాంజీ ఉపాధి గ్రామసభ



**వాస్తవం : రామగిరి:**

రామగిరి మండలం రత్నాపూర్ గ్రామపంచాయతీ ఆవరణలో శనివారం వీ.బి.జి.రాంజీ ఉపాధి గ్రామ సభ జరిగింది. సర్పంచ్ పల్లె ప్రతిమ పీవీ రావు అధ్యక్షతన ఈ గ్రామసభ నిర్వహించారు. 2027- 28వ సంవత్సరానికి సంబంధించిన ఉపాధి హామీ పథకం పనులు గుర్తించారు. కందకల తవ్వకం,సోకు ఫిట్స్, ఫామ్ ఫండ్ లు,ఇతర ఉపాధి పనులను గుర్తించారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ బాద్రపు ప్రవళిక - ప్రశాంత్,మండల ఉపాధి ఏ.పీ.వో వరకోల్ల మౌనిక,టెక్నికల్ అసిస్టెంట్ మల్క అఖిల,వార్డ్ సభ్యులు పబ్బ స్రవంతి వెం కటేష్, కలవైన రవి,బత్తిని ప్రశాంత్, పున్నం మని తేజ,కండే లక్ష్మీ గట్టయ్య,కండె సాహితి పొశం,సెక్రటరీ గంగుల సంతోష్,ఫీల్డ్ అసిస్టెంట్ సందవేన జ్యోతి కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# చర్ల మండలంలో పోషణ్ మాస్

**వెయ్యి రోజుల ప్రాముఖ్యతపై తల్లులకు అవగాహన**



**వాస్తవం : చర్ల**

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చర్ల మండల పరిధిలోని తిప్పాపురం అంగన్వాడీ కేంద్రంలో పోషణ మాసంలో భాగంగా శనివారం తల్లులకు అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అంగన్వాడీ టీచర్ మాట్లాడుతూ.. గర్భం దాల్చిన నాటి నుండి బిడ్డకు రెండు సంవత్సరాలు వచ్చే వరకు గల వెయ్యి రోజులు బంగారు రోజులుగా అభివర్ణించారు. ఈ వెయ్యి రోజుల్లో తల్లి మరియు బిడ్డకు సరైన పోషకాహారం అందించడం వలన బిడ్డ శారీరకంగా, మానసికంగా దృఢంగా ఎదుగుతారని తెలిపారు. గర్భిణీలు, బాలింతలు తీసుకోవాల్సిన ఆహారం, పిల్లలకు అందించాల్సిన అనుబంధ ఆహారం, పరిశుభ్రత, రక్తహీనత నివారణపై తల్లులకు వివరించారు. అంగన్వాడీ కేంద్రం ద్వారా అందించే బలవర్ధక ఆహారాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో గర్భిణీలు, బాలింతలు, గ్రామ మహిళలు పాల్గొన్నారు.

# అగ్ని ప్రమాదాలపై విద్యార్థులకు అవగాహన



**వాస్తవం : రాజేంద్రనగర్**

అగ్నిమాపక శాఖ ఆధ్వర్యంలో విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. శనివారం పుప్పాలగూడ బాలాజీ నగర్ లిటిల్ కడిల్స్ ఇంటర్నేషనల్ ప్రీ స్కూల్ బాల విద్యార్థులు లంగర్ హౌస్ లోని అగ్నిమాపక కేంద్రాన్ని సందర్శించారు. సమాజ రక్షణలో అగ్నిమాపక సిబ్బంది పోషిస్తున్న పాత్రను విద్యార్థులు వీక్షించారు. అత్యవసర సమయాల్లో ప్రదర్శించే సాహసాలను చిన్నారులు ప్రత్యక్షంగా చూసి తెలుసుకున్నారు. ఫైర్ ఇంజన్ పనితీరును అధికారులు వివరించారు. ఈ కార్యక్రమంలో లంగర్ హౌస్ ఫైర్ స్టేషన్ అధికారి సంతోష్ కుమార్, మహేష్,తాహిర్ అలీ ఖాన్, పాఠశాల ప్రిన్సిపాల్ హర్షిత సక్సేనా, తదితరులు పాల్గొన్నారు.

# కరెంట్ కోతలతో అల్లాడుతున్న అప్పారెడ్డిపల్లి

**విద్యుత్ సబ్ స్టేషన్ ముందు గ్రామస్థులు, రైతుల మెరుపు ధర్నా**

**గృహ, వ్యవసాయ విద్యుత్ సరఫరా సక్రమంగా అందించాలని గ్రామస్తుల డిమాండ్**

**వాస్తవం : మాడుగుల**

మాడ్గుల మండలం, అప్పారెడ్డిపల్లి గ్రామంలో గత కొద్దీ రోజులుగా తరచుగా జరుగుతున్న విద్యుత్ కోతలతో గ్రామ ప్రజలు, రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు. ముఖ్యంగా రాత్రి వేళల్లో గృహ విద్యుత్ సరఫరాలో తరచూ అంతరాయాలు ఏర్పడుతుండటంతో విద్యార్థులు, వృద్ధులు, మహిళలు, చిన్నపిల్లలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. అదేవిధంగా వ్యవసాయ విద్యుత్ సరఫరాలో కూడా తరచూ అంతరాయాలు ఏర్పడుతుండటంతో రైతు లు పంటలకు సకాలంలో సాగునీరు అందించలేక పోతున్నారని పేర్కొన్నారు. విద్యుత్ సరఫరా సక్రమంగా లేకపోవడం వల్ల బోర్ మోటార్లు నడపలేక, పంటలు ఎండిపోయే పరిస్థితి ఏర్పడుతోందని రైతులు ఆందోళన వ్యక్తం చేశారు.వ్యవసాయానికి కేటాయించిన విద్యుత్‌ను నిర్ణీత సమయాల్లో నిరం



తరంగా సరఫరా చేయడంతో పాటు, గృహ విద్యుత్ సరఫరాలో తరచూ ఏర్పడుతున్న అంతరాయాలను వెంటనే పరిష్కరించాలని గ్రామస్తులు విద్యుత్ శాఖ అధికారులను కోరారు.అప్పారెడ్డిపల్లి గ్రామంలో విద్యుత్ సరఫరాకు సంబంధించిన సాంకేతిక సమస్యలను గుర్తించి శాశ్వత పరిష్కారం చూపాలని, ముఖ్యంగా రాత్రి సమయాల్లో గృహ విద్యుత్ కోతలను తగ్గించాలని వారు విజ్ఞప్తి చేశారు.విద్యుత్ కోతల కారణంగా ప్రజలు, రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అధికారులు వెంటనే స్పందించి గ్రామానికి నిరంతర విద్యుత్ సరఫరా అందేలా చర్యలు తీసుకోవాలి అని గ్రామ స్తులు రైతులు లైన్ మెన్ కట్ట రవీందర్‌కి వినతి పత్రం అందచేశారు. ఈ కార్యక్రమంలో బీఆరెస్ నాయకులు గోవిందు శ్రీధర్,ఉడుతల సత్తయ్య, పల్లేటి యాదయ్య, బన్నె యాదయ్య, పల్లేటి నర్సింహా, పెద్దయ్య గౌడ్,తోట పాపయ్య, అడవి రాములు, పులికంటి యాదయ్య, పులికంటి మల్లేష్, దోనాదుల నర్సింహా, ఉడుతల చంద్రయ్య, పల్లేటి కృష్ణయ్య, ఉడుతల శ్రీకాంత్, గుండాల పర్వతాలు, కొంరెడ్డి లింగయ్య,పలాది సైదులు, రామకృష్ణ, పల్లేటి శ్రీశైలం పాల్గొన్నారు.

# అక్టోబర్ 4న ఐ ఆర్ సీ ఎస్ మేనేజింగ్ కమిటీ ఎన్నికలు

**24వ తేదీన నామినేషన్ల స్వీకరణ**

**జిల్లా ప్రెసిడెంట్, జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్**

**వాస్తవం : రాజన్న సిరిసిల్ల (ప్రతినిధి)**



అక్టోబర్ 4 న ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ (ఐఆర్ సీ ఎస్) మేనేజింగ్ కమి టీ ఎన్నికలు రాజన్నసిరిసిల్ల జిల్లా కేంద్రంలోని జిల్లా సమాఖ్య భవనంలో నిర్వ హించనున్నట్లు జిల్లా ప్రెసిడెంట్, జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ తెలిపారు. మొత్తం 15 మంది సభ్యులను ఎన్నుకోవడం జరుగుతుందని పేర్కొన్నారు. ఐ ఆర్ సిఎస్‌లో సభ్యత్వం ఉన్న వారు పోటీ చేసేందుకు అర్హులని స్పష్టం చేశా రు. ఈ నెల 24న ఉదయం 10.00 గంటల నుంచి మధ్యాహ్నం 01.00 గంట వరకు నామినేషన్ల దాఖలు, 25 న నామినేషన్ల పరిశీలన, 26న నామి నేషన్ల ఉప సంహరణ ఉంటుందని, అదే రోజు పోటీలో ఉన్న అభ్యర్థుల జాబితా ప్రకటిస్తామని తెలిపారు. అక్టోబర్ 4న ఆదివారం ఉదయం 08.00 గంటల నుంచి రాజన్నసిరిసిల్ల జిల్లా కేంద్రం లోని జిల్లా సమాఖ్య భవనంలో ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ మేనేజింగ్ కమిటీ ఎన్నికలు నిర్వహించనున్నట్లు వెల్ల డించారు. అదే రోజు 04.00 గంటలకు కౌంటింగ్, ఫలితాలను ప్రకటిస్తామని తెలిపారు. ఎన్నికల అధికారిగా జిల్లా ఆడిట్ అధికారి శ్రీనివాస్ వ్యవహరిస్తున్నారని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ పేర్కొన్నారు.

# బోడుప్పల్ సర్కిల్‌లో అక్రమ షెడ్ తొలగించాల్సిందే

**డీసీ శైలజను కలిసి వినతిపత్రం**

**ఫ్రీ విలేజ్ కాలనీ ఎదురుగా అక్రమ షెడ్‌పై ఫిర్యాదు.. చర్యలకు డీసీ హామీ!**

**వాస్తవం : మేడిపల్లి :**

బోడుప్పల్ సర్కిల్ పరిధిలోని ఫ్రీ విలేజ్ కాలనీ ఎదురుగా ఏర్పాటు చేసినట్లు ఆరోపిస్తున్న అక్రమ షెడ్డును వెంటనే తొలగించి, అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకోవాలని సెటిలర్స్ ఫోరం అధ్యక్షులు కత్తి వెంకట్ రెడ్డి డిమాండ్ చేశారు. ఈ మేరకు డీసీ శైలజను కలిసి వినతిపత్రం అందజేశారు. కాలనీకి ఎదురుగా అక్రమంగా షెడ్ నిర్మాణం చేపట్టడం వల్ల స్థానికులకు ఇబ్బందులు కలుగుతున్నాయని, నిబంధనలకు విరుద్ధంగా ఉన్న నిర్మాణాలపై అధికారులు తక్షణమే స్పందించాలని ఆయన కోరారు. బోడుప్పల్ సర్కిల్ పరిధిలో అక్రమ నిర్మాణాలపై ప్రత్యేక దృష్టి సారించి, నిబంధనల మేరకు చర్యలు



తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.ఈ సందర్భంగా సెటిలర్స్ ఫోరం ప్రతినిధులు ఫిర్యాదు వివరాలను డీసీ శైలజ దృష్టికి తీసుకెళ్లగా, త్వరలోనే పరిశీలించి చర్యలు చేపడతామని హామీ ఇచ్చినట్లు తెలిపారు. అక్రమ నిర్మాణాలపై అధికార యంత్రాంగం స్పందించడంతో స్థానికుల్లో ఆశలు వ్యక్తమవుతున్నాయి. తాల్క శత్రుజ్ఞ, అమర్ లింగారెడ్డి, బజ్జూరి శ్రీనివాస్ గుప్తా, సంతోష్ రెడ్డి, దాసరి మహేష్, చక్రవర్తి, వెంకట స్వామి, ఆనంద్ గౌడ్, శ్రీధర్ రెడ్డి, రాజు యాదవ్, రాజు నాయక్,ఉపేందర్, రాజశేఖర్ రెడ్డి, అనంత రెడ్డి, ప్రభాకర్ రెడ్డి, వెంకట్ రమణ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# పర్వతాపూర్ ఎస్సీ శ్మశాన వాటికలో బోరు ఏర్పాటు

**అధికారులకు కృతజ్ఞతలు తెలిపిన తుంగతుర్తి రవి**



**వాస్తవం : మేడిపల్లి :** మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 9వ డివిజన్ పర్వతాపూర్ ఎస్సీ స్మశాన వాటికలో ఈరోజు బోరు వేసే కార్యక్రమం విజయవంతంగా పూర్తయింది. వేసిన బోరులో నీరు పడటంతో శ్మశాన వాటికకు నీటి సదుపాయం కలగనుంది. ఈ సందర్భంగా స్థానికులు హర్షం వ్యక్తం చేశారు. ఈ బోరు పనులకు సహకరించి, కార్యక్రమం విజయవంతం కావడానికి చొరవ చూపిన డిప్యూటీ కమిషనర్ శైలజ గారికి, ఏఈకి మరియు సంబంధిత అధికారులకు 9వ డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు తుంగతుర్తి రవి ధన్యవాదాలు తెలిపారు. ప్రజల అవసరాలను గుర్తించి, శ్మశాన వాటికలో నీటి సదుపాయం కల్పించేందుకు అధికారులు అందించిన సహకారం అభినందనీయమని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో డీసీసీ ప్రధాన కార్యదర్శి జలంధర్ రెడ్డి, మేడిపల్లి డివిజన్ ఉపాధ్యక్షులు యాసారం నగేష్, ప్రధాన కార్యదర్శి సుదర్శన్ రెడ్డి, యాసారం శ్రీనివాస్, యాసారం సురేష్, యాసారం ప్రభాకర్, యాసారం నరేష్, యాసారం విఘ్నేష్, అంబేద్కర్ యువజన సంఘం అధ్యక్షులు యాసారం సాయికుమార్, బద్దల సురేష్, పాముకుంట్ల లక్ష్మయ్య, మిర్యాల కిరణ్ కుమార్, నానపురం దానయ్య,పర్వతాపూర్ ఎస్సీ శ్మశాన వాటిక సభ్యులు, కాలనీ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

# ఎయిడ్స్‌పై అవగాహన కార్యక్రమం

**వాస్తవం : హుస్నాబాద్ :**

హుస్నాబాద్ ప్రభుత్వ ఆసుపత్రి ఇంటిగ్రేటెడ్ కౌన్సిలింగ్ అండ్ టెస్టింగ్ సెంటర్ (ఐసీటీసీ) ఆధ్వర్యంలో పట్టణంలోని సివి రామన్ స్కూల్, కేరళ హై స్కూల్ లో 9వ తరగతి, 10వ తరగతి విద్యార్థిని విద్యార్థులకు హెచ్ఐవి ఎయిడ్స్ వ్యాధి గురించి ఐసీటీసీ కౌన్సిలర్ ఆర్. తిరుపతి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో వారు హెచ్ఐవి ఎయిడ్స్ వ్యాధి రావడానికి గల కారణాలు మరియు ఎయిడ్స్ రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి విద్యార్థులకు వివరించారు. ఐ సి టి సి కేంద్రంలో పరీక్షలు చేయించుకోవడం వలన పేషంట్ల విషయాలు గోప్యంగా ఉంచబడతాయని హెచ్ఐవి ఎయిడ్స్ సలహాల కొరకు ఉచిత టోల్ ఫ్రీ నెంబర్ 1097 కు ఫోన్ చేసి తెలుసుకోవచ్చని చెప్పా



రు. హెచ్ఐవి 15 సంవత్సరాల నుండి 25 సంవత్సరాల వయసు గల వారికి 50 శాతం వస్తుందని, హెచ్ఐవి వచ్చిన వారు క్రమం తప్పకుండా ఆంటీ రెట్రో వైరల్ తెరపి చికిత్స ద్వారా వ్యాధిని అరికట్టవచ్చని, దేశ భవిష్యత్తు యువత యొ క్క భుజస్కంధములపై ఆధారపడి ఉంటుందని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సివి రామన్ హై స్కూల్ ప్రధానోపాధ్యాయుడు కాయిత నారాయణరెడ్డి, కేరళ ప్రధానోపాధ్యాయుడు బుర్ర రాజేందర్,జీవశాస్త్ర ఉపాధ్యాయుడు కిరణ్ మరియు ఉపాధ్యాయ బృందం విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

# కన్నాపూర్‌లో భూ భారతి రీ సర్వే అవగాహన సదస్సు



**వాస్తవం : శంకరపట్నం :** కరీంనగర్ జిల్లా శంకరపట్నం మండలం కన్నాపూర్ గ్రామంలో శనివారం భూ భారతి రీ సర్వే కార్యక్రమంపై రెవిన్యూ శాఖ ఆధ్వర్యంలో గ్రామ ప్రజలకు అవగా హన సదస్సు నిర్వహించారు. గ్రామ సర్పంచ్ నూనె రమ అధ్యక్షతన జరిగిన గ్రామ సభకు హాజరైన తహసిల్దార్ కే. సురేఖ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన భూభారతి రిసర్వే నిర్వహించే సమయంలో రైతు లు, గ్రామస్తులు స్వయంగా హాజరై సర్వేయర్లకు సహకరించి తమ భూ ముల రికార్డులను, యాజమాన్య హక్కులను సరి చూసు కోవాలని సూచిం చారు. ఈ సర్వే ద్వారా రైతులు ఎలాంటి ఆందోళన చెందా ల్సిన అవసరం లేదని భరోసా ఇచ్చారు. ఏ డి ఏ కిషన్ రావు మాట్లాడుతూ సర్వే సమయంలో రైతులు, పట్టాదారులు తమ భూమికి సంబంధించిన హద్దు లను గుర్తించి, ఏదైనా సమస్యలు ఉంటే సర్వేయర్లకు తెలపాలని సూచించారు. ప్రతి అంగుళం భూమిని ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో సర్వే చేసి, భవిష్య త్తులో వివాదాలు తలెత్తకుండా క్యూ ఆర్ కోడ్ కలిగిన నూతన పట్టాదారు పాస్ పుస్తకాలు, మ్యా పులు అందజేస్తారని తెలిపారు. ఈ సమావేశంలో వ్యవ సాయ మార్కెట్ కమి టీ వైస్ చైర్మన్ నాం పల్లి తిరుపతి, డిఐ రత్నం, సర్వేయర్ మనోజ్, ఆర్ఐ రాములు, జిపిఓ శ్రీని వాస్, పంచాయతీ కార్యదర్శి అహ్మద్, ఏఈఓ సునంద , గ్రామ పంచాయతీ వార్డు సభ్యులు, రెవిన్యూ సిబ్బంది , గ్రామ ప్రజలు పాల్గొన్నారు.



# జంతు ప్రేమను చాటుకున్న ఐఆర్ఈసీ సంస్థ



**వాస్తవం : రాజేంద్రనగర్**

జంతు ప్రేమను చాటుకున్న ఐఆర్ఈసీ (ఇంటర్నేషనల్ రియల్ ఎస్టేట్ కాన్ఫరెన్స్)2026, లక్సరీ ఎక్స్ పో సంస్థ. శనివారం హైదరాబాద్ నెహ్రూ జూలా జికల్ పార్కులో ఈ సంస్థ నిర్వాహకులు ఒంటి కొమ్ము ఖడ్గమృగాన్ని దత్తత తీసుకున్నారు. హైదరాబాద్ రియల్టర్స్ అసోసియేషన్ చైర్మన్, ప్రెసిడెంట్ ఇతర సభ్యులతో కలిసి మూడు నెలల కాలానికి దత్తత తీసుకున్నారు. ఇందుకు సంబంధించిన చెక్కును జూ పార్క్ క్యూరేటర్ జె. వసంతకు అందజేశారు.

# జిల్లా స్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో మద్దూరు కేజీబీవీ విద్యార్థుల ప్రతిభ

**రాష్ట్ర స్థాయికి ఎంపికైన ఎన్. సింధూజ**



**వాస్తవం : మద్దూరు**

సిద్దిపేట జిల్లాలో నిర్వహించిన జిల్లా స్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో మద్దూరు కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. 10వ తరగతి విద్యార్థిని బి. శృతి షాట్‌పుట్ అండర్-16 విభాగంలో బంగారు పతకం సాధించి రాష్ట్ర స్థాయికి ఎంపికైంది. ఎన్. సింధూజ అదే విభాగంలో కాంస్య పతకం, టి. అర్చన అండర్-18 విభాగంలో కాంస్య పతకం సాధించారు.ఈ సందర్భంగా పాఠశాల స్పెషల్ ఆఫీసర్ ఎం. స్వప్న విద్యార్థులను, పీఈటీ స్రవంతిని అభినందించారు. విద్యార్థులు క్రీడల్లో మరింత ప్రతిభ కనబరిచి ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు.

జన్మదినోత్సవాలు, పదవీ విరమణ శుభాకాంక్షల

ప్రకటనల కోసం సంప్రదించండి

8074124190



# సీసీ కెమెరాలు....నిఘా నేత్రాలు

**అంతక పేటలో 8 సీసీ కెమెరాలు**
**ప్రారంభించిన సీఐ శ్రీధర్, ఎస్ఐ ప్రశాంత్**





**వాస్తవం : హుస్నాబాద్ :**

సీసీ కెమెరాలు నిఘా నేత్రాలని, నేరాలను నియంత్రించడంలో కీలకంగా పని చేస్తాయని హుస్నాబాద్ సీఐ శ్రీధర్ అన్నారు. శనివారం సిద్దిపేట కమిషనరేట్ పరిధిలోని హుస్నాబాద్ నియోజకవర్గం అక్కనపేట్ మండలం అంతకపేట గ్రామంలో సిద్దిపేట పోలీస్ కమిషనర్ రష్మి పెరుమాళ్ చొరవతో సిద్దిపేట్ సురక్షా నేత్ర కార్యక్రమంలో భాగంగా 8సీసీ కెమెరాలను ఏర్పాటు చేసి అక్కన్నపేట ఎస్ఐ శాతరాజు ప్రశాంత్‌తో కలిసి సీఐ శ్రీధర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా సీఐ శ్రీధర్ మాట్లాడుతూ, గ్రామంలో నేరాల నియంత్రణ, అసాంఘిక కార్యకలాపాల నివారణ, నేరస్తుల కదలికలపై నిఘా ఉంటుందన్నారు. ప్రజల భద్రతను మరింత బలోపేతం చేయడంలో సీసీ కెమెరాలు కీలకపాత్ర పోషిస్తాయని తెలిపారు.

అక్కన్నపేట ఎస్ఐ శాతరాజు ప్రశాంత్ మాట్లాడుతూ, గ్రామంలో సీసీ కెమెరాల ఏర్పాటు వల్ల అనుమానాస్పద వ్యక్తులు, వాహనాల కదలికలను పర్యవేక్షించడంతో పాటు, నేరాలు జరిగిన సందర్భంలో దర్యాప్తుకు అవసరమైన ఆధారాలను సేకరించడంలో కూడా ఎంతగానో సీసీ కెమెరాలు ఉపయోగపడతాయని తెలిపారు.సీసీ కెమెరాల ఏర్పాటుకు సహకరించిన సర్పంచ్, ఉప సర్పం చ్, వార్డు సభ్యులు, గ్రామ ప్రజలు, ప్రజాప్రతినిధులు మరియు సంబంధిత సిబ్బందిని సీఐ, ఎస్ఐలు అభినందించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కొయ్యడ సృజన్ కుమార్, ఉప సర్పంచ్ కిషన్ రెడ్డి, వార్డు సభ్యులు, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# ప్రచార ఆర్భాటాలకే తప్ప ప్రజలకు చేసిందేమీ లేదు

**మాజీ సీఎం కేసీఆర్ ను తిట్టుడే సీఎం పనిగా పెట్టుకున్నారు**

**బీఆర్ఎస్ నియోజకవర్గ అధికార ప్రతినిధి మల్లికార్జున్ రెడ్డి**



**వాస్తవం : హుస్నాబాద్ :**

ప్రచార ఆర్భాటాలకే తప్ప ప్రజలకు చేసింది ఏమీ లేదని, కాంగ్రెస్ ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయకనే ప్రజల దృష్టి మళ్లించేందుకు ప్రయత్నం చేస్తున్నదని బీఆర్ఎస్ నియోజకవర్గ అధికార ప్రతినిధి అయిలేని మల్లికార్జున్ రెడ్డి ఆరోపించారు. శనివారం హుస్నాబాద్ నియోజకవర్గం అక్కన్నపేట మండలంలోని మోత్కులపల్లి గ్రామంలో గల బీఆర్ఎస్ సర్పంచ్ ఏల్పుగొండ కొమురమ్మ - రవీందర్ గృహంలో కార్యకర్తలతో కలిసి మాట్లాడారు. కాంగ్రెస్ అధికారంలోకి రావడానికి అసెంబ్లీ ఎన్నికల్లో ప్రజలకు అడ్డగోలుగా హామీలు ఇచ్చి గెలిచిన అనంతరం 1000 రోజులైనా హామీలు అమలు చేయకుండా ప్రజలను మోసం చేస్తుందన్నారు. హామీలు నెరవేర్చాలని ప్రధాన ప్రతిపక్ష పార్టీ బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు అడిగితే సరైన సమాధానం చెప్పకుండా నాయకులపై కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతూ ఇబ్బందులకు గురి చేస్తుందన్నారు. కాంగ్రెస్ కేవలం ప్రచార ఆర్భాటాలకు మాత్రమే పరిమితం అయ్యిందని ప్రజలకు చేసింది ఏమీ లేదన్నారు. ప్రతిరోజు సీఎం రేవంత్ రెడ్డికి మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ను తిట్టడమే పనిగా పెట్టుకున్నారని, ప్రజల తరఫున అసెంబ్లీ సమావేశాలలో బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు మాట్లాడకుండా సస్పెండ్ చేయడం, బయట మాట్లాడితే కక్ష సాధింపు చర్యలకు పాల్పడి భయభ్రాంతులకు గురి చేసే ప్రయత్నం చేస్తుందన్నారు. కేసీఆర్ భూములపై ఆరోపణలు చేస్తూ హడావిడిగా కాలం గడుపుతుందే తప్ప పాలనను గాలికి వదిలేసింది అన్నారు. ఇప్పటికైనా కక్ష సాధింపు చర్యలు మానుకొని ప్రజలకు ఇచ్చిన హామీలపై దృష్టి పెట్టాలని డిమాండ్ చేశారు. లేనిచో రానున్న రోజుల్లో ప్రజల పక్షాన నిలబడి పోరాటం చేయడానికైనా వెనుకాడబోమని హెచ్చరించారు. ఇందులో నాయకులు మ్యాకల కుమారస్వామి, జక్కుల అశోక్, గొంగళి శ్రీనివాస్, మడక లింగయ్య ఉన్నారు.

# నేరాల నియంత్రణలో సీసీ కెమెరాల పాత్ర కీలకం

**హుస్నాబాద్ ఏసీపీ సదానందం**





**వాస్తవం : హుస్నాబాద్ :**

నేరాల నియంత్రణలో సీసీ కెమెరాల పాత్ర కీలకమని హుస్నాబాద్ ఏసీపీ సౌదారపు సదానందం అన్నారు. శనివారం హుస్నాబాద్ మండలం నాగారం గ్రామంలో "సురక్షా నేత్ర"లో భాగంగా 12 సీసీ కెమెరాలను ఏసిపి సదానందం సిఐ శ్రీధర్, ఎస్ఐ లక్ష్మారె డ్డిలతో కలిసి ప్రారంభించారు.సిద్దిపేట పోలీస్ కమిషనర్ రష్మి పెరుమాళ్ చొరవతో ప్రారంభించిన ఈ కార్యక్రమంలో ఏసిపి సదానందం మాట్లాడుతూ...గ్రామంలో నేరా ల నియంత్రణ, అసాంఘిక కార్యకలాపాల నివారణ, నేరస్తుల కదలికలపై నిఘా మరి యు ప్రజల భద్రతను మరింత బలోపేతం చేయడంలో సీసీ కెమెరాలు కీలకపాత్ర పోషి స్తాయని తెలిపారు.గ్రామంలో సీసీ కెమెరాల ఏర్పాటు వల్ల అనుమానాస్పద వ్యక్తులు, వాహనాల కదలికలను పర్యవేక్షించడంతో పాటు, నేరాలు జరిగిన సందర్భంలో దర్యా ప్తుకు అవసరమైన ఆధారాలను సేకరించడంలో కూడా ఎంతగానో ఉపయోగపడతా యని అధికారులు తెలిపారు.సీసీ కెమెరాల ఏర్పాటుకు సహకరించిన సర్పంచ్, ఉప సర్పంచ్, వార్డు సభ్యులు, గ్రామ ప్రజలు, ప్రజాప్రతినిధులు మరియు సంబంధిత సిబ్బందిని అధికారులు అభినందించారు.

## అంగన్వాడీ కేంద్రంలో పోషకాహార వారోత్సవాలు



**వాస్తవం : రాజేంద్రనగర్**

శివరాంపల్లి లోని అంగన్వాడి కేంద్రంలో శనివారం పోషకాహార వారోత్సవాలు జరిగాయి.సూపర్వైజర్ పద్మజ, కోమల్ తల్లులకు పోషకాహార విలువ, ప్రాముఖ్యతను వివరించారు. పిల్లల శరీరానికి కావల్సిన విటమిన్లు, ప్రోటీన్లు, ఖనిజ లవణాల లోపంతో వచ్చే అనారోగ్యాలను పోషకాహారంతో నివారించవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో టీచర్ జయశ్రీ, రత్న, సంగీత, సుమిత్ర, కల్పన,సహాయకురాలు సుశీల పాల్గొన్నారు.

## అన్నదానంలో సీపీఐ నాయకులు



**వాస్తవం : రాజేంద్రనగర్**

సిపిఐ రాజేంద్రనగర్ మండల కార్యాలయం వద్ద బస్తీ వాసులు ఏర్పాటుచేసిన గణేష్ మండపంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించిన సిపిఐ మీసాల బ్రదర్స్ జె. విజయ్ ఆనంద్ గౌడ్, జె. సదానంద్ గౌడ్, జె. ఆనంద్ గౌడ్. ఈ కార్యక్రమంలో సిపిఐ మండల కార్యదర్శి కన్యగారి నర్సింహ్మరెడ్డి, సిపిఐ మండల కార్యాలయం కార్యదర్శి జి. సత్యం, సిపిఐ కాటేదాన్ శాఖ కార్యదర్శి శ్రీరాములు, రాత్లావత్ బిక్షపతి నాయక్, కె.మధు, బస్తీ వాసులు పాల్గొన్నారు.

# అన్నదానం మహాదానం



**వాస్తవం : రామగిరి:**

అన్నదానం మహాదానం అని శ్రీ రామ్ లక్ష్మణ్ గణేష్ మండలి నిర్వాహకులు అన్నారు. శనివారం శ్రీ రామ్ లక్ష్మణ్ గణేష్ మండలి జోన్ 2 సెంటనరీ కాలనీ అధ్వర్యంలో ఏర్పాటు చేసిన అన్న ప్రసాదం కార్యక్రమాన్ని కొబ్బరికాయ కొట్టి ప్రారంభిం చారు. అంతకు ముందు శ్రీ రామ్ లక్ష్మణ్ గణేష్ మండలి నిర్వాహకులు ప్రత్యేక వినాయక పూజలో పాల్గొన్నారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, అన్నదానం అనేది ఒక మహాత్కార్యం అని,అన్ని దానలల్లో అన్నదానం మాత్రమే గొప్ప దానం అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు,భక్తులు, మహిళలు,పిల్లలు,పెద్దలు,తదితరులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## గణేష్ మండపాల వద్ద

# పరిశుభ్రంగా ఉంచండి

**డిప్యూటీ కమిషనర్‌కు భాగ్యనగర్ గణేష్ ఉత్సవ సమితి విజ్ఞప్తి**
**మండపాల వద్ద ప్రత్యేక చర్యలు తీసుకుంటామని డిప్యూటీ కమిషనర్ హామీ**



**వాస్తవం : మేడిపల్లి :** గణేష్ నవరాత్రి ఉత్సవాల సందర్భంగా బోడుప్పల్ సర్కిల్ పరిధిలోని అన్ని వినాయక మండపాల వద్ద మున్సిపల్ కార్మికుల చేత పరిశుభ్రంగా చేయుట గురించి బోడుప్పల్ భాగ్యనగర్ గణేశ ఉత్సవ సమితి కన్వీనర్ ఉప్పరి విజయ్ ఆధ్వర్యంలో బోడుప్పల్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ ఏ శైలజకు వినతిపత్రం అందించారు. భక్తుల తాకిడి అధికంగా ఉంటుంది, అన్ని మండపాల వద్ద అన్న ప్రసాద వితరణ తదితర కార్యక్రమాలు నిత్యం జరుగుతుంటాయి కాబట్టి అన్ని మండపాల వద్ద పరిశుభ్రత, మంచినీటి సౌకర్యం గురించి మున్సిపల్ అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని భాగ్యనగర్ గణేశ ఉత్సవ సమితి సభ్యులు డిప్యూటీ కమిషనర్ ను కోరారు. సాను కూలంగా స్పందించిన డిప్యూటీ కమిషనర్ అన్ని మండపాల వద్ద శుభ్రత పరిశుభ్రత గురించి మండప నిర్వహణ ప్రత్యేక అవగాహన కల్పించామని, మున్సిపల్ సిబ్బంది ఎప్పటికప్పుడు చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో బోడుప్పల్ భాగ్యనగర్ గణేష్ ఉత్సవ సమితి సలహాదారులు బజార్ కిరణ్ గౌడ్,కో కన్వీనర్ ఆసర్ల బీరప్ప, ఎస్ఎంఎస్ ప్రగతి, గొల్లపూడి శ్రీనివాసరావు, పద్మ మహేశ్వర్ రెడ్డి, పారిపల్లి రాజేష్ చారి, డి నర్సింగ్ నాయక్, జక్కుల అరుణ్ కుమార్, జడిగే మురళి యాదవ్, నాయకులు దొంతి నవీన్, తదితరులు పాల్గొన్నారు.

# సదరం శిబిరాలకు ఖరారు

**వాస్తవం : సిరిసిల్ల**

రాజన్న సిరిసిల్ల జిల్లా ప్రభుత్వ జనరల్ హాస్పిటల్ లో సెప్టెంబర్, అక్టోబర్ నెలలో సదరం శిభిరములు నిర్వహణ ఖరారు చేశారు. కంటిచూపు, వినికిడి, అర్థో, మానసిక , జనరల్ వైకల్యాలకు సంబంధించి తేదిలలో క్యాంపులు నిర్వహించనున్నట్లు, మం డల అభివృద్ధి అధికారులు, కమీషనర్లకు (సిరిసిల్ల, వేములవాడ) తెలియపరచి వారి పరిధిలోని వారికి సమాచారం అందేలా చూడాలని కోరారు. సదరం శిభిరంకు హాజ రగు దివ్యాంగులు సంబందిత మెడికల్ డాక్యుమెంట్లు, ఎక్స్ --రే, అప్లికేషన్ ఫామ్, ఆధార్ కార్డ్, పాస్ పోర్ట్ సైజ్ ఫోటో, ఫోన్ నెంబర్ తమ వెంట తీసుకుని ఉదయం 09.00 గంటలకు సదరం శిభిరంకు హాజరు కాగలరని తెలియ జేశారు.

# జిల్లా స్థాయి 'నెట్ బాల్' పోటీలు షురూ

**ఎస్ జి ఎఫ్ సెక్రెటరీ యాకూబ్, ఆర్గనైజింగ్ సెక్రటరీ రాం వేణు**



**వాస్తవం : మందమర్రి :**

(ఎస్.జి.ఎఫ్ ) స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో.. మంచిర్యాల జిల్లా మందమర్రి పాత బస్టాండ్ సమీపంలోని హైదరాబాద్ కృష్ణవేణి పాఠశాలలో.. 14 సంవత్సరాలుపు లోపు విద్యార్థులకు అదేవిధంగా 17 సంవత్సరాల లోపు విద్యార్థులకు ఎంపిక పోటీలు నిర్వహిస్తున్నట్లు ఎస్.జి.ఎఫ్ సెక్రటరీ యాకుబ్ , ఆర్గనైజింగ్ సెక్రటరీ రాం వేణు తెలిపారు. ఈ నెట్ బాల్ పోటీలలో మంచిర్యాల జిల్లాకు సంబంధించిన ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో విద్యన భ్యసిస్తున్న విద్యార్థులందరూ అర్హులే.. ఈ ఎంపిక పోటీలలో పాల్గొనే విద్యార్థులు 20- 9 -2026 ఆదివారం ఉదయం 9 గంటలకు హాజరు కావాలని కోరారు. పోటీలో పాల్గొనే విద్యార్థుల వెంట వారి ఆధార్ కార్డు ,బర్త్ సర్టిఫికెట్, వారు చదువుతున్న పాఠశాల నుండి బోనాఫైడ్ తప్పనిసరిగా వెంట తెచ్చుకోవాలని తెలిపారు.

# 'సర్' ప్రక్రియను విజయవంతం చేయాలి

**ఆర్ డి ఓ అధ్యక్షతన అఖిలపక్ష నేతల సమావేశం**




**వాస్తవం : వేములవాడ**

అర్హులైన ప్రతి ఓటరు ఓటునునమోదుచేసుకోవాలని, నోటీసులో పేర్కొన్న విధంగా గుర్తింపు పత్రాలను సమర్పించాలని వేములవాడ ఆర్‌డిఓ కెవిఎస్‌బి.కుమారి విజ్ఞప్తి చేశారు. వేములవాడ రెవెన్యూ డివిజన్ కార్యాలయంలో శనివారం ఆర్ డి ఓ కెవిఎస్ కు మారి అధ్యక్షతన అఖిలపక్షం నాయకులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు.ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ "సర్‌బి ప్రక్రియ సంపూర్ణంగా విజయవంతం అగుటకు ప్రతి ఒక్కరు భాగస్వాములు కావాలని, అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించేలా కృషి చేయాలని,ఎన్నికల సంఘం ప్రకటించిన ప్రక్రియకు సంబంధించిన షెడ్యూల్‌ను ఓటర్లు పరిశీలించాలని, షెడ్యూల్ ప్రకారం ఓటును నమోదు చేసుకోవాలని కోరారు.వేములవాడ నియోజకవర్గంలోని 262 పోలింగ్ కేంద్రాలలో పోలింగ్ కేంద్రం వారిగా ప్రభుత్వ పరంగా బిఎల్‌ఓలు,వివిధ రాజకీయ పార్టీల పక్షాన బిఎల్ ఏలు పని చేస్తున్నారని, ఓటరుకు ఏదేని సందేహం,సమాచారం అవసరం ఉన్నచో సంబంధిత పోలింగ్ కేంద్రం బిఎల్ ఓలు, బిఎల్‌ఏలను సంప్రదించవలెనని కోరారు.ఓటరుకు ఏదేని అభ్యంతరాలు, పిర్యాదులు, చేర్పులు, మార్పులు,సవరణలు, తొలగింపులు, కొత్తగా ఓటరు నమోదుకు ఫారం 6,7,8లలో అవసరం ఉన్న ఫారంను ఉపయోగించుకోవాలని,అక్టోబర్ 7న చివరి రోజు నమోదు చేసుకోవాలని, 9న తుది ఓటరు జాబితా విడుదల చేస్తామని ప్రకటించారు.ఈ సమావేశంలో అఖిలపక్ష నేతలు వి.నిత్యానంద రావు, పొలాస నరేందర్, చింతలకోటి రామస్వామి గౌడ్,ఎన్నికల సీనియర్ అసిస్టెంట్ శ్రావణ్ పాల్గొన్నారు.

జన్మదినోత్సవాలు,
పదవీ విరమణ
శుభాకాంక్షల

ప్రకటనల కోసం సంప్రదించండి
8074124190

వాస్తవం




# తిరుమల లడ్డులో జంతు కొవ్వు లేదని తేల్చేసిన ఈడీ

## పవన్ కళ్యాణ్‌పై నెటిజన్ల విమర్శలు

**తిరుమల :** తిరుమల తిరుపతి దేవస్థానం పవిత్ర శ్రీవారి లడ్డూ ప్రసాదం తయారీకి ఉపయోగించే నెయ్యి నాణ్యత వివాదంపై గత కొంతకాలంగా జరుగుతున్న ప్రచారానికి సంబంధించి కేంద్ర దర్యాప్తు సంస్థల నుంచి అత్యంత కీలకమైన విషయాలు వెలుగులోకి వచ్చాయి. సెంట్రల్ బ్యూరో ఆఫ్ ఇన్వెస్టిగేషన్ ఆధ్వర్యంలో పనిచేస్తున్న ప్రత్యేక దర్యాప్తు బృందం అలాగే ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ సంయుక్తంగా జరిపిన సమగ్ర దర్యాప్తులో టీటీడీ లడ్డూ ప్రసాదాల తయారీకి వాడిన నెయ్యిలో ఎలాంటి జంతు కొవ్వు వాడినట్లు ఆధారాలు లేవని స్పష్టం చేశాయి. అయితే, ఈ విచారణలో నెయ్యి సరఫరాలో కొంత కల్తీ జరిగినట్లు మాత్రం అధికారులు నిర్ధారించారు. పంపిణీ చేసిన నెయ్యిలో కొద్దిపాటి రసాయనాలు మరియు వృక్ష ఆధారిత పదార్థాలు వంటి కల్తీ పదార్థాలు కలిపినట్లు దర్యాప్తు నివేదికలో వెల్లడైంది. ఇక శ్రీవారి లడ్డూ ప్రసాదం తయారీలో జంతు కొవ్వు కలిసిందంటూ గతంలో ఆంధ్రప్రదేశ్ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ మరి యు కూటమి నాయకులు చేసిన తీవ్ర ఆరోపణలు అవాస్తవమని తేలడంతో, ప్రస్తుతం సోషల్ మీడియాలో వారిపై విమర్శల వర్షం కురుస్తోంది. సిట్ దర్యాప్తులో నెయ్యిలో జంతు కొవ్వు వాడినట్లు ఎలాంటి ఆధారాలు లేవని స్పష్టమవ్వడంతో, కేవలం రాజకీయ లబ్ధి పొందేందుకు, ప్రత్యర్థులపై బురదజల్లే దురుద్దేశంతోనే అత్యంత పవిత్రమైన తిరుమల శ్రీవారిని వివాదాల్లోకి లాగారనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. కేవలం రాజకీయ ప్రయోజనాల కోసం దేవుడి పవిత్రతతో చెలగాట మాడి, కోట్లాది మంది హిందూ భక్తుల విశ్వాసాలను, మనో భావాలను తీవ్రంగా దెబ్బతీశారంటూ నెటిజన్లు, సామాజిక వేత్తలు పవన్ కళ్యాణ్ మరియు కూటమి నేతల తీరును తప్పుపడుతున్నారు.



**తిరుమల తిరుపతి దేవస్థానం పవిత్ర శ్రీవారి లడ్డూ ప్రసాదం తయారీకి ఉపయోగించే నెయ్యి నాణ్యత వివాదంపై గత కొంతకాలంగా జరు గుతున్న ప్రచారానికి సంబంధించి కేంద్ర దర్యాప్తు సంస్థల నుంచి అత్యంత కీలకమైన విషయాలు వెలుగులోకి వచ్చాయి. సెంట్రల్ బ్యూరో ఆఫ్ ఇన్వెస్టిగేషన్ ఆధ్వర్యంలో పనిచేస్తున్న ప్రత్యేక దర్యాప్తు బృందం అలాగే ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ సంయుక్తంగా జరిపిన సమగ్ర దర్యాప్తులో టీటీడీ లడ్డూ ప్రసాదాల తయారీకి వాడిన నెయ్యిలో ఎలాంటి జంతు కొవ్వు వాడినట్లు ఆధారాలు లేవని స్పష్టం చేశాయి.**



## స్టార్టప్‌లే భారతదేశపు యువత సత్తాకు నిదర్శనం

**ప్రధానమంత్రి నరేంద్రమోదీ**



**ఢిల్లీ :** దేశ యువత సామర్థ్యానికి, వారి సత్తాకు దేశంలోని స్టార్టప్ పర్యావరణ వ్యవస్థే ఒక గొప్ప ఉదాహరణ అని ప్రధానమంత్రి నరేంద్రమోదీ అన్నారు. ఒకప్పుడు కేవలం పెద్ద నగరాలకే పరిమితమైన స్టార్టప్‌ల కథ ఇప్పుడు చిన్న పట్టణాలకు, నగరాలకు కూడా విస్తరించిందని ఆయన పేర్కొన్నారు. 20వ రోజ్‌గార్ మేళా సందర్భంగా శనివారం ఆయన వివిధ ప్రభుత్వ సంస్థలకు కొ త్తగా ఎంపికైన యువతను ఉద్దేశించి ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో దేశ వ్యాప్తంగా 45 ప్రాంతాల నుంచి 51,000 మందికిపైగా యువతకు నియామక పత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ప్రధాని మాట్లాడుతూ.. భారత దేశం నేడు ప్రపంచంలోనే మూడో అతిపెద్ద స్టార్టప్ వ్యవస్థగా నిలిచిందన్నారు. గుర్తించబడిన స్టార్టప్‌లలో దాదాపు సగం టైర్-2, టైర్-3 నగరాల్లోనే ఉన్నా యని చెప్పారు. ఇది భారతదేశ నూతన ఆర్థికవ్యవస్థలో గ్రామాలు, పట్టణాలు, చిన్న నగరాల నుంచి వచ్చిన యువత కూడా స్టార్టప్‌ల స్థాపనలో కీలకపాత్ర పోషిస్తున్నారని చూపిస్తోందని వివరించారు. చిన్న పట్టణాలకు చెందిన యువత తమ సొంత ఆలోచనలతో కొత్త కంపెనీలను స్థాపిస్తూ తమతోపాటు ఇతర యువతకు ఉపాధి అవకాశాలను సృష్టిస్తున్నారని ప్రధాని ప్రశంసించారు. ప్ర భుత్వ రంగంతోపాటు ప్రైవేటు రంగంలోనూ ఉపాధి అవకాశాలను వేగంగా విస్తరించేందుకు తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని స్పష్టంచేశారు. ఈ లక్ష్యం తోనే సుమారు రూ.1 లక్ష కోట్లతో 'ప్రధాన మంత్రి వికసిత్ భారత్ రోజ్‌గార్ యోజన'ను ప్రారంభించామని చెప్పారు. ఈ పథకం ద్వారా దాదాపు 2 కోట్ల మంది యువత తొలిసారిగా ఉద్యోగ రంగంలోకి ప్రవేశించే అవకాశం లభి స్తుందన్నారు. మొదటిసారి ఉద్యోగంలో చేరేవారికి రూ.15,000 వరకు ప్రోత్సా హకం అందించడంతోపాటు కొత్త ఉద్యోగాలను సృష్టించే యాజమాన్యాలకు కూడా ప్రోత్సాహకాలు ఉంటాయని మోదీ తెలిపారు. ప్రభుత్వ వ్యవస్థలో భాగం కాబోతున్న నూతన ఉద్యోగులకు ప్రధాని కీలక సూచనలు చేశారు. మీరు మీ తల్లిదండ్రులు ఎదుర్కొన్న ఇబ్బందులు, కష్టాలు దేశంలోని ఏ పౌరుడూ ఎదుర్కో కుండా చూడటమే మీ లక్ష్యం కావాలని ప్రధాని అన్నారు. ప్రభుత్వ సేవలో చేరి న వెంటనే ఈ మిషన్‌ను మీరు చేపట్టాలని పిలుపునిచ్చారు. నిరంతరం నేర్చు కోవడం, కొత్త నైపుణ్యాలు, టెక్నాలజీని అందిపుచ్చుకోవడం చాలా ముఖ్యమని ప్రధాని అన్నారు. ఇందుకోసం 'మిషన్ కర్మయోగి' ని రూపొందించినట్లు తెలిపారు.

## అంతర్మథనంలో దానం

గడిచిన ఎన్నికల్లో బీఆర్‌ఎస్ తరపున ఖైరతాబాద్ నుంచి ఎమ్మెల్యేగా గెలిచిన మూడు నెలలకే దానం కాంగ్రెస్‌లోకి దూకడం వెనుక అధికారం కోసమే అన్నది బహిరంగ రహస్యం. వాస్తవానికి గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో కాంగ్రెస్‌కు ప్రాతినిథ్యం లేకపోవడంతో తాను పార్టీ మారితే ఆ కోటా నుంచి మంత్రివర్గంలోకి పోవచ్చనే ఆశతో దానం కాంగ్రెస్ కండువా కప్పుకున్నారనేది వాస్తవం. కానీ ఆయన ఒకటి తలిస్తే.. పరిస్థితి మరొకలా మారింది. సికింద్రాబాద్ పార్లమెంటు స్థానానికి ఆయనను అభ్యర్థిగా నిలపడంలో ఓ 'ముఖ్య' నేతనే కీలక పాత్ర పోషించారనేది అప్పట్లో అందరికీ తెలిసిందే. పార్లమెంటు ఎన్నికల్లో ఓటమి తర్వాత నెలలు గడిచినా మంత్రి పదవి దక్కకపోవడంతో మోస పోయానని ఆయన గ్రహించారు. మరోవైపు బీఆర్‌ఎస్ న్యాయపోరాటం కంటి మీద కునుకు లేకుండా చేసింది. వ్రతం చెడినా ఫలితం దక్కనట్టు.. ఓవైపు నియోజకవర్గంలో తనకు వ్యతిరేకంగా కాంగ్రెస్ అంతర్గత రాజకీయాలు సలుపుతుండగా.. ఇంకో వైపు ప్రభుత్వంలో తనకు ప్రాధాన్యం దక్కకపోవడం, అధికార యం త్రాంగం తనను ఖాతరు చేయకపోవడంతో రెంటికీ చెడ్డ రేవడిలా ఆయన పరిస్థితి తయారైంది. హైకోర్టు తీర్పు తనకు వ్యతిరేకంగా వస్తే సుప్రీంకోర్టును ఆశ్రయించాలని ముందునుంచే సిద్ధమైనట్టు ఆయన అనుచరులు చెప్తున్నారు. కానీ అందుకు భిన్నంగా ఉప ఎన్నికకు సిద్ధమవుతున్నట్టు ప్రకటించడంతో దీని వెనుక 'ముఖ్య'నేత ప్రోద్బలం ఉన్నట్టు ప్రచారం జరిగింది. రామ గుండం ఎమ్మెల్యే మక్కన్‌సింగ్ ఠాకూర్ శుక్రవారం సాయంత్రం దానం తో భేటీ కావడం.. ఆ తర్వా తనే తాను ప్రజాక్షేత్రంలో తేల్చుకుంటానని దానం ప్రకటించారు. ఉప ఎన్నికకు సిద్ధమని కాలుదువ్విన దానం నాగేందర్ తెల్లారేసరికి సుప్రీం కోర్టును ఆశ్రయించడం వెనుక ఆంతర్యమేందనే చర్చ జరుగుతున్నది. ఇంతకుముందు అజారుద్దీన్‌కు మంత్రి పదవి ఇచ్చి, ఆపై ఎమ్మెల్సీ ఇచ్చినట్టుగానే తనను కూడా ప్రజా క్షేత్రం నుంచి తప్పించే ప్రమాదమున్నదని నాగేందర్ భయ పడుతున్నట్టు తెలిసింది.

# దానం యూటర్న్



## ఎమ్మెల్యే సభ్యత్వ రద్దుపై సుప్రీం కోర్టులో పిటిషన్

**ఢిల్లీ/హైదరాబాద్:** బీఆర్‌ఎస్ పార్టీ తరపున ఎమ్మెల్యేగా గెలుపొంది కాంగ్రెస్‌లోకి ఫిరాయించి అనర్హత వేటుకు గురైన దానం నాగేందర్ యూటర్న్ తీసుకున్నారు. హైకోర్టు తీర్పును స్వాగతిస్తున్నా, ఉప ఎన్నికకు సిద్ధమేనని ప్రకటించిన దానం సుప్రీం కోర్టును ఆశ్రయించారు. తన ఎమ్మెల్యే సభ్యత్వాన్ని రద్దు చేస్తూ హైకోర్టు ఇచ్చిన తీర్పును సవాల్ చేస్తూ అత్యున్నత ధర్మాసనంలో శనివారం ఆయన పిటిషన్ వేశారు. ఫిరాయింపు ఎమ్మెల్యే దానం నాగేందర్ ఒక్కరోజులోనే మాట మార్చారు. అనర్హత వేటు వేస్తూ హైకోర్టు ఇచ్చిన తీర్పును స్వాగతిస్తున్నానని, సుప్రీం కోర్టుకు వెళ్లే ఆలోచన లేదని, ఉప ఎన్నికకు సిద్ధమేనని పేర్కొన్న ఆయన శనివారం సుప్రీం కోర్టును ఆశ్రయించారు. తనపై అనర్హత వేటును ఆయన సవాల్ చేశారు. ఖైరతా బాద్ నుంచితన ఎమ్మెల్యే సభ్యత్వాన్ని రద్దు చేస్తూ శుక్రవారం తెలంగాణ హైకోర్టు ఇచ్చిన తీర్పును సవాల్ చేశారు దానం.



## దానం నాగేందర్ ప్లాన్‌కు చెక్!

### సుప్రీంకోర్టులో విచారణకు ముందే కేవియట్ దాఖలు

**ఢిల్లీ/హైదరాబాద్, సెప్టెంబర్ 19:** దానం నాగేందర్ వ్యవహారంపై తెలంగాణ రాజకీయాల్లో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఈ అంశంపై బీజేపీ ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి, బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి సుప్రీం కోర్టులో ముందస్తుగా కేవియట్ పిటిషన్ దాఖలు చేశారు. తన అనర్హతపై తెలంగాణ హైకోర్టు ఇచ్చిన తీర్పును సవాలు చేస్తూ దానం నాగేందర్ సుప్రీం కోర్టును ఆశ్రయించడంతో.. బీజేపీ, బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలు అలర్ట్ అయ్యారు. దానం నాగేందర్ సుప్రీంకోర్టులో పిటిషన్ వేస్తే.. తమ వైపు వాదనలు వినకుండా ఎలాంటి ఏకపక్ష ఆదేశాలు లేదా మధ్యంతర ఉత్తర్వులు ఇవ్వకూడదని కోరుతూ ఏలేటి మహేశ్వర్ రెడ్డి, పాడి కౌశిక్ రెడ్డి ఈ కేవియట్ దాఖలు చేశారు. ఎమ్మెల్యేల అనర్హత పిటిషన్లపై స్పీకర్ నిర్ణయం తీసుకోవాలంటూ గతంలో వచ్చిన తీర్పుల నేపథ్యంలో, ఈ వ్యవహారాన్ని వీలైనంత త్వరగా తేల్చాలని బీఆర్‌ఎస్, బీజేపీ నాయకులు పట్టుబడుతున్నారు. ఈ పిటిషన్‌తో సుప్రీం కోర్టు దానం నాగేందర్ పిటిషన్‌ను విచారణకు స్వీకరించినప్పుడు, ఈ కేవియట్ పిటిషనర్లకు నోటీసులు ఇవ్వడం తప్పనిసరి కానుంది.

# జన్వాడ ఫాంహౌస్..అక్రమ నిర్మాణం

**అనుమతులు లేకుండా నాలాపై నిర్మించారు**

**విచారణ జరిపి చర్యలు తీసుకోండి**

**హైడ్రా కమిషనర్‌కు కాంగ్రెస్ నేతల ఫిర్యాదు**

**జన్వాడకు వచ్చిన ఎంపీలు, ఎమ్మెల్యేల బృందం**

**శంకరపల్లి :** జన్వాడలోని ఫాంహౌస్ ముమ్మాటికీ అక్రమ నిర్మాణమని కాంగ్రెస్ ప్రజాప్రతినిధుల బృందం ఆరోపించింది. ఎలాంటి అనుమతులు లేకుండా నాలాపై దీనిని నిర్మించారని తెలిపింది. ఈ నిర్మాణాలపై విచారణ జరిపి తగిన చర్యలు తీసుకోవాలంటూ హైడ్రాకు ఫిర్యాదు చేసింది. శనివారం జన్వాడ ఫాంహౌస్‌ను పరిశీలించేందుకు కాంగ్రెస్ ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు ప్రత్యేక బస్సులో హైదరాబాద్ నుంచి వచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఫాంహౌస్ తనదేనని, ఇక్కడికి వస్తే కేసులు పెడతానని అంటున్న ప్రదీప్ రెడ్డి ఇన్ని ఎకరాల్లో ఫాంహౌస్ ఎలా కట్టారని ప్రశ్నించారు. ప్రైవేటు భూముల్లోకి రావాలనే ఉద్దేశం తమకు లేదని, అయితే కేసీఆర్ కుటుంబం అధికార దుర్వినియోగానికి పాల్పడిన తీరును ప్రజలకు చూపించేందుకే వచ్చామని అన్నారు. జన్వాడలోని సర్వే నంబర్లు 301, 311, 313లోని భూములను కేటీఆర్ బాల్యమిత్రుడికి చెందిన డీఎన్‌బీ కంపెనీకి బదిలీ చేశారని కాంగ్రెస్ నేతలు ఆరోపించారు. డి.రాజేశ్ అనే వ్యక్తి సత్యం రామలింగరాజు కుమారుడికి సన్నిహితుడని, అతని పేరిట ఉన్న కంపెనీకి బదిలీ చేశారని అన్నారు. ఈడీ, ఐటీ కేసుల్లో ఉన్న 13 ఎకరాలను ఎలా? ఎందుకు? రిలీజ్ చేశారనేది బయటపడాలన్నారు. ప్రదీప్ రెడ్డికి ఈ భూమి ఎలా బదిలీ అయిందో కేంద్ర మంత్రులు కిషన్‌రెడ్డి, బండి సంజయ్ చెప్పాలన్నారు. భూమి బదిలీపై ఈడీ, ఐటీ శాఖలు హైకోర్టుకు ఎందుకు వెళ్లలేదని పశ్నించారు. ఇది ముమ్మాటికీ కేటీఆర్‌కు చెందిన ఫాంహౌసేనని, ప్రదీప్ రెడ్డి కేటీఆర్ బినామీ అని అన్నారు. జన్వాడ ఫాంహౌస్ ఎవరి పేరిట ఉందో స్పష్టత లేదని, దీనిపై సమగ్ర విచారణ జరపాల్సిన అవసరం ఉందని ఎంపీ మల్లు రవి అన్నారు. ఇక్కడ ఉన్న భూముల రికార్డులు, యాజమాన్య వివరాలు, భవన నిర్మాణాలకు సంబంధించిన అనుమతులను క్షేత్ర స్థాయిలో పరిశీలించడమే తమ పర్యటన ఉద్దేశమని పేర్కొన్నారు. జన్వాడ ఫాంహౌస్‌ను కేటీఆర్ లీజుకు తీసుకున్నట్లు చెబుతున్నప్పటికీ.. తమ వద్ద ఉన్న సమాచారం ప్రకారం ఆ లీజు ఒప్పందంపై అనుమానాలు ఉన్నాయని ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి అన్నారు. దీనిపై వాస్తవాలను బయటపెట్టాల్సిన అవసరం ఉందన్నారు. ఈ మేరకు జన్వాడ నుంచే హైడ్రా కమిషనర్ రంగనాథ్‌కు, మున్సిపల్ కమిషనర్‌కు ఆయన ఫోన్ చేసి మాట్లాడారు. ఈ మేరకు రంగనాథ్ సమాధానమిస్తూ.. జన్వాడలోని సర్వే నంబర్ 311/7లో ఉన్న భవనం, ఫాంహౌస్ వివాదానికి సంబంధించి ఈ ఏడాది జూలై 15న ప్రదీప్ రెడ్డి అనే వ్యక్తికి నోటీసులు జారీ చేసినట్లు తెలిపారు. అయితే ప్రదీప్ రెడ్డి నాలుగు వారాల గడువు కోరారని, కానీ.. ఇప్పటివరకు ఎలాంటి ఆధారాలు సమర్పిం చలేదని చెప్పారు. గూగుల్ మ్యాప్‌లు, సర్వే ఆఫ్ ఇండియా మ్యాప్‌లను పరిశీలిస్తే.. ఫాం హౌస్ కింద నుంచి ఫిరంగి నాలా వెళ్తున్నట్లు తేలిందని వెల్లడించారు. మున్సిపల్, రెవెన్యూ, ఇరిగేషన్ శాఖలతో కలిసి జాయింట్ సర్వే నిర్వహించి తగిన చర్యలు తీసుకుంటామన్నారు. కాగా, అవినీతి సొమ్ముతో కేటీఆరే జన్వాడ ఫాంహౌస్‌ను నిర్మించుకున్నారని ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్ ఆరోపించారు. ఈ భూము ల్లో రూ.300 కోట్ల స్కామ్ జరిగిందని, అన్ని విషయాలూ త్వరలోనే బయటికి వస్తాయన్నారు.



# ఆదర్శ్ నగర్ గణనాథ మండపం వద్ద సేవా సంకల్ప్ అభియాన్

**చింతకింది గోవర్ధన్ గౌడ్ ఆధ్వర్యంలో**

**1000 మందికి అన్న ప్రసాద వితరణ**



**వాస్తవం : శేరిలింగంపల్లి సెప్టెంబర్ 19 :** ఆదర్శ్ నగర్ యూత్ అసోసియేషన్ గణనాథ మండపం వద్ద బిజెపి రాష్ట్ర నాయకుడు చింతకింది గోవర్ధన్ గౌడ్ ఆధ్వర్యంలో సేవా సంకల్ప్ అభియాన్ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ప్రధాని నరేంద్ర మోదీ చిత్రపటానికి ఘనంగా పాలాభిషేకం నిర్వహించి, వెయ్యి మందికి పైగా భక్తులకు అన్న ప్రసాద వితరణ చేశారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న రంగారెడ్డి జిల్లా పరిషత్ మాజీ వైస్ చైర్మన్ నందకుమార్ యాదవ్ మాట్లాడుతూ.. ప్రధాని నరేంద్ర మోడీ ప్రజా జీవితంలో 25 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా ఆయన పుట్టిన రోజు సెప్టెంబర్ 17 మొదలు అక్టోబర్ 17 వరకు నెల రోజుల పాటు దేశ వ్యాప్తంగా సేవా సంకల్ప్ అభియాన్ పేరిట సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. అందులో భాగంగా చింతకింది గోవర్ధన్ గౌడ్ వినాయక నవరాత్రి ఉత్సవాలలో ఐదు గణనాథ మండపాల వద్ద అన్నసమారాధన కార్యక్రమాలు నిర్వహించాలని సంకల్పించడం అభినందించదగ్గ విషయమని అన్నారు. ఇది ఆదర్శంగా తీసుకుని బిజెపి నాయకులు, మోడీ అభిమానులు వాడ వాడలా సేవా కార్యక్రమాలు నిర్వహించాలని పిలుపునిచ్చారు. అనంతరం చింతకింది గోవర్ధన్ గౌడ్ మాట్లాడుతూ.. దేశ ప్రజల కోసం తన జీవితాన్ని అంకితం చేసిన ప్రధాని నరేంద్ర మోడీ పేరిట అన్న ప్రసాద వితరణ చేయడం తన అదృష్టంగా భావిస్తున్నట్టు తెలిపారు. ఆదర్శ్ నగర్ కాలనీ యూత్, లింగంపల్లి రేయిన్ ట్రీ కమ్యూనిటీ, గోపి నగర్ బజరంగ్ యూత్, ప్రశాంత్ నగర్ కాలనీ సంక్షేమ సంఘం గణనాథ మండపాల వద్ద దాదాపు 6 వెల మందికి పైగా అన్న ప్రసాద వితరణ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు రాఘవేంద్రరావు, నాగేశ్వరరావు, రంగా గౌడ్, బెజగం కేశవులు, పుట్ట వినయకుమార్ గౌడ్, గోపాల్ యాదవ్, శ్రీనివాస్ నాయి, రవీందర్ రెడ్డి, అల్లూరయ్య, శ్రీనివాసరావు, అరుణ్ గౌడ్, డాకయ్య గౌడ్, కృష్ణ, శ్రీకాంత్ గౌడ్, అశోక్ పాల్గొన్నారు.



**బొజ్జ గణపయ్య ఆశీస్సులు**

# అందరిపై ఉండాలి

**కందుల సంధ్యారాణి**



**వాస్తవం : రామగుండం**

గణపతి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా రామగుండం నియోజకవర్గంలోని పలు ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన వినాయక మండపాలను బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షులు కందుల సంధ్యారాణి సందర్శించారు. మండపాల్లో కొలువుదీరిన గణనాథులను దర్శించుకుని ప్రత్యేక పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా నిర్వాహకులు, భక్తులతో కలిసి గణపతి ఆశీస్సులు తీసుకున్నారు. ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని, రామగుండం నియోజకవర్గం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలని గణనాథుని ప్రార్థించినట్లు తెలిపారు. అనంతరం పలు వినాయక మండపాల వద్ద నిర్వహించిన అన్నదాన కార్యక్రమాల్లో పాల్గొని అన్నదానాన్ని ప్రారంభించారు. భక్తులకు స్వయంగా అన్నప్రసాదం వడ్డించి, నిర్వాహకులను అభినందించారు. వినాయక నవరాత్రి ఉత్సవాలు భక్తి, ఆధ్యాత్మికతతో పాటు ప్రజల్లో ఐక్యత, సేవాభావాన్ని పెంపొందించడానికి దోహదపడుతున్నాయని కందుల సంధ్యారాణి పేర్కొన్నారు. గణపతి నవరాత్రి ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో ప్రశాంత వాతావరణంలో నిర్వహించాలని ఆమె కోరారు. ఈ కార్యక్రమంలో బి ఎం ఎస్ నాయకులు యాదగిరి సత్తయ్య , గట్టు శ్రీనివాస్,పాలకుర్తి మండల అధ్యక్షులు మెరుగు నరేష్ గౌడ్ 8 ఇంక్లైన్ కాలనీ మండల అధ్యక్షులు ఆకుల శశి, మూకిరి రాజు,గంధం ఆంజనేయులు, జక్కన బాలు,మీస వికాస్, పైడిపల్లి విజయ్ గౌడ్, చరణ్, బడుగు జలంధర్, గోపు రామన్న, మేడం రాజు తదితరులు పాల్గొన్నారు.

# డబ్బు రాజకీయాల జబ్బును వదిలిస్తాం

**రాజ్యాధికారమే టీఆర్పీ అంతిమ లక్ష్యం**

**తీన్మార్ మల్లన్న పాదయాత్రను విజయవంతం చేద్దాం**

**బహుజనుల రాజ్యాధికారంతోనే సామాజిక తెలంగాణ**

**రాజ్యాధికార యాత్రకు మద్దతుగా బైక్ ర్యాలీ**

**జిల్లా అధ్యక్షులు మహేష్ వర్మ**

**వాస్తవం : చెన్నూరు ఆర్సీ**



తెలంగాణ రాజ్యాధికార పార్టీ మంచిర్యాల జిల్లా అధ్యక్షులు మహేష్ వర్మ నాయకత్వంలో భీమారం మండల అధ్యక్షులు దెబ్బెట శంకర్, తగరం రాజ్ కుమార్‌ల ఆధ్వర్యంలో మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన బైక్ ర్యాలీని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు మహేష్ వర్మ పాల్గొని విజయవంతం చేశారు. రాజ్యాధికారమే అంతిమ లక్ష్యంగా ఈ ర్యాలీని ఉద్దేశించి జిల్లా అధ్యక్షులు మహేష్ వర్మ మాట్లాడుతూ,తెలంగాణ రాజ్యాధికార పార్టీ వ్యవస్థాపక అధ్యక్షులు తీన్మార్ మల్లన్న రాజ్యాధికారమే లక్ష్యంగా రాజ్యాధికార పాదయాత్రని ప్రారంభించారన్నారు. రాజ్యాధికార ఆవశ్యకతను ప్రజలకు వివరిస్తూ, ఎవరంతో వారికంత వాటా అందించేందుకు ఈ యాత్రను జిల్లావ్యాప్తంగా కొనసాగిస్తున్నామని తెలిపారు. రానున్న రోజుల్లో తెలంగాణ రాజ్యాధికారం పార్టీ ఆధ్వర్యంలో ప్రజా పోరాటాలను కొనసాగించే దిశగా జిల్లా నాయకత్వం, మండల నాయకత్వం పనిచేస్తుందని స్పష్టం చేసారు. వచ్చేది బీసీల రాజ్యమే అని, తీన్మార్ మల్లన్న నాయకత్వంలోనే బహుజనుల రాజ్యాధికారాన్ని సాధిస్తామని ధీమా వ్యక్తం చేసారు. డబ్బు రాజకీయాల జబ్బును వదిలించి, ప్రజా రాజకీయాలను ప్రజలకు అందించేందుకు తెలంగాణ రాజ్యాధికార పార్టీ పని చేస్తుందని వివరించారు. ప్రజలకు అందుబాటులో ఉండి ప్రజా సమస్యలపై ప్రత్యేక దృష్టి సారించి, ప్రభుత్వ వైఫల్యాలను ఎత్తి చూపిస్తూ, ప్రజలను చైతన్యం చేస్తూ, రాజ్యాధికారం దిశగా అడుగులు వేస్తామని తెలిపారు. తీన్మార్ మల్లన్న నాయకత్వంలోనే రాజ్యాధికారం సాధిస్తామనే విషయాన్ని ప్రజలకు స్పష్టం చేసారు. బీసీ ఉద్యమాన్ని నీరు కార్చేందుకు దొరల దగ్గర ఊడిగం చేస్తున్న కొంతమంది బీసీ ఉద్యమ ద్రోహులను ఉపేక్షించేది లేదని, రానున్న రోజుల్లో ప్రజలే వారికి బుద్ది చెబుతారని హెచ్చరించారు. అగ్రవర్ణ నాయకుల రాజకీయ ఆధిపత్యాన్ని అంతం చేసి, రాజ్యాధికారాన్ని ప్రజలకు అందిస్తామని స్పష్టం చేసారు. తీన్మార్ మల్లన్న చేస్తున్న ఈ రాజ్యాధికార యాత్రకి మద్దతు తెలిపి, బహుజన వర్గాలు కలిసికట్టుగా ముందుకు రావాలని, రాజ్యాధికార సాధనలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు పడాల శివతేజ, మహమ్మద్ లతీఫ్, మండల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

**పెండింగ్లో ఉన్న ఫీజు రియంబర్స్మెంట్, స్కాలర్షిప్‌లను**

# వెంటనే విడుదల చేయాలి




**వాస్తవం : చెన్నూర్ ఆర్సి**

యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీ పేరుతో రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన జీవో నెం. 97ను తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ పిడిఎస్ యు విద్యార్థి సం ఘం ఆధ్వర్యంలో మంచిర్యాల జిల్లా చెన్నూర్ పట్టణ కేంద్రంలో విద్యార్థులు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా పిడిఎస్‌యు జిల్లా ఉపాధ్యక్షులు పి.సికిందర్ మాట్లాడుతూ ...తెలంగాణ ప్రభుత్వం తీసుకొచ్చిన శక్తి స్కీం, జీవో నెం. 97 కారణంగా తమ విద్యా భవిష్యత్తు తీవ్రంగా ప్రభావితమవుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. పాలి టెక్నిక్ డిప్లొమా పూర్తి చేసిన తర్వాత ఇంజినీరింగ్‌లో ఉన్నత విద్య అభ్యసించాలనుకునే విద్యార్థులు, తాజా నిర్ణయాల వల్ల మళ్లీ ఇంటర్మీడియట్ చదవాల్సిన పరిస్థితి ఏర్పడుతుందని తెలిపారు. దీనివల్ల తమ విలువైన మూడు సంవత్సరాల విద్యా కా లం వృథా అయ్యే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. తక్షణమే జీవో నెం. 97ను రద్దు చేసి పాలిటెక్నిక్ విద్యార్థులకు న్యాయం చేయాలని పి డి ఎస్ యు డి మాండ్ చేసింది. ఈ కార్యక్రమంలో పిడిఎస్ యు నాయకులు పవన్, కిరణ్, రవితేజ, రమ్య, మమత, కీర్తన తదితరులు పాల్గొన్నారు.

# గ్రామ పంచాయతీలకు నిధులు కేటాయించాలి

**నిధులు లేక గ్రామాల అభివృద్ధి ఎలా సాధ్యం..**

**సర్పంచుల ఆగ్రహం**

**జనోదయ : మద్దూరు**

గ్రామ పంచాయతీలకు రాష్ట్ర ప్రభుత్వం నిధులు కేటాయించకపోవడంపై సిద్దిపేట జిల్లా ధూళిమిట్ట మండలంలోని వివిధ గ్రామాల సర్పంచులు ఆగ్రహం వ్యక్తం చేశారు. గ్రామాల అభివృద్ధికి అవసరమైన నిధులు అందకపోవడంతో ప్రజలకు కనీస సదుపాయాలు కల్పించలేకపోతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. శనివారం ధూళిమిట్ట మండల కేంద్రంలోని రైతు వేదికలో నిర్వహించిన మండల సమీక్ష సమావేశంలో పలువురు సర్పంచులు తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. ఈ సందర్భంగా సర్పంచులు మాట్లాడుతూ.. గ్రామ పంచాయతీలకు రాష్ట్ర ప్రభుత్వం నయా పైసా కూడా నిధులు మంజూరు చేయడం లేదని ఆరోపిం చారు. నిధులు లేకుండా గ్రామాలను అభివృద్ధి పథంలో ఎలా ముందుకు తీసుకెళ్లగలమని ప్రశ్నించారు. గ్రామా ల్లో పారిశుధ్యం, తాగునీరు, వీధి దీపాలు, ఇతర మౌలిక సదుపాయాల కల్పనకు నిధులు అవసరమని తెలిపారు. అయితే ప్రభుత్వం నుంచి నిధులు రాకపోవడంతో ప్రజల అవసరాలను తీర్చడంలో ఇబ్బందులు ఎదురవుతున్నాయని పేర్కొన్నారు. అదేవిధంగా కేంద్ర ప్రభుత్వం నుంచి వచ్చే నిధులను సైతం జీపీడీపీ,గ్రామ పంచాయతీ అభివృద్ధి ప్రణాళిక పేరుతో ఖర్చు చేయనివ్వడం లేదని సర్పంచులు ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామాల అవసరాలకు అనుగుణంగా నిధులను వినియోగించుకునే అవకాశం కల్పించాలని కోరారు. నిధుల కొరత కారణంగా గ్రామాల్లో కనీస సదుపాయాలు కల్పించలేని పరిస్థితి నెలకొందని, ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో ఇబ్బందులు ఎదురవుతున్నాయని తెలిపారు. ప్రజలు ఓట్లు వేసి తమను సర్పంచులుగా ఎన్నుకున్నారని, ప్రస్తుతం గ్రామాల్లో అభివృద్ధి పనులు చేపట్టలేకపోవడంతో ఓట్లు వేసిన ప్రజలకు ముఖం చూపించలేని పరిస్థితి ఏర్పడిందని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి గ్రామ పంచాయతీలకు నిధులు విడుదల చేయడంతోపాటు గ్రామాల అభివృద్ధి కోసం ప్రత్యేకంగా నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు.



గ్రామాల అభివృద్ధి, ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాల కల్పనకు ప్రభుత్వం ప్రాధాన్యత ఇవ్వాలని ధూళిమిట్ట మండల సర్పంచుల ఫోరం మండల అధ్యక్షురాలు నలగొప్పుల రేణుక రాములు, సర్పంచులు బర్మ రాజమల్లయ్య, దాసారం బాలకృష్ణ, చొప్పరి రామ్, మారెడ్డి నారాయణరెడ్డి, ధరావత్ రూపేష్ తదితరులు కోరారు. ప్రభుత్వం వెంటనే నిధులు మంజూరు చేసి గ్రామ పంచాయతీలను అభివృద్ధి బాటలో నడిపించాలని విజ్ఞప్తి చేశారు.

# పీఆర్సీ అమలు చేయాలి

**డీఏలు విడుదల చేయాలి**

**టీఆర్‌టీఎఫ్ జగిత్యాల జిల్లా శాఖ అధ్యక్షుడు తుంగూరి సురేష్ డిమాండ్**



**వాస్తవం : ధర్మపురి :** రాష్ట్రంలోని ఉపాధ్యాయ, ఉద్యోగుల సమస్యలను పరిష్కరించడంతో పాటు పెండింగ్‌లో ఉన్న పీఆర్సీని వెంటనే అమలు చేయాలని, పెండింగ్ 6 డీఏలను విడుదల చేయాలని తెలంగాణ రాష్ట్ర టీచర్స్ ఫెడరేషన్ (టీఆర్‌టీఎఫ్) జగిత్యాల జిల్లా శాఖ అధ్యక్షుడు తుంగూరి సురేష్, రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు గజబీంకర్ గోవర్ధన్ లు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ధర్మపురి మండలంలో నిర్వహించిన టీఆర్‌టీఎఫ్ సభ్యత్వ నమోదు కార్యక్రమంలో పాల్గొని వారు మాట్లాడుతూ ఉపాధ్యాయ, ఉద్యోగుల ఆర్థిక ప్రయోజనాలను పరిరక్షించేందుకు ప్రభుత్వం తక్షణ చర్యలు చేపట్టాలని కోరారు. పీఆర్సీ అమలులో జాప్యం, డీఏల విడుదలలో నిర్లక్ష్యం కారణంగా ఉపాధ్యాయ,ఉద్యోగులు ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. ఉద్యోగులకు రావాల్సిన న్యాయమైన ఆర్థిక ప్రయోజనాలను సకాలంలో అందించడం ప్రభుత్వ బాధ్యత అని అన్నారు. పెండింగ్‌లో ఉన్న డీఏలను వెంటనే విడుదల చేసి,పీఆర్సీ అమలుకు స్పష్టమైన కార్యాచరణ ప్రకటించాలని కోరారు. టీఆర్‌టీఎఫ్ ఉపాధ్యాయ, ఉద్యోగుల హక్కుల సాధన కోసం నిరంతరం కృషి చేస్తున్న సంఘమని, సంఘాన్ని మరింత బలోపేతం చేసేందుకు సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఉపాధ్యాయులకు పిలుపునిచ్చారు. ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం కోసం ఐక్యంగా ముందుకు సాగాలని సూచించారు. ఈ కార్యక్రమంలో టీఆర్‌టీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు నాయిని విజయానంద్,రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి దాసరి భీమన్న, మండల అధ్యక్షుడు బండారి సతీష్,ప్రధాన కార్యదర్శి మెరుగు రమేష్,నాయకులు భూమా రెడ్డి, డి వెంకట రమణ,సాదు శ్రీకాంత్,వొజ్జల మహేష్,దాసరి రాజన్న,నాగేశ్వర్,కనకయ్య పాల్గొన్నారు.

# నో బ్యాగ్ డే

**స్థానిక పోలీస్ స్టేషన్‌ను సందర్శించిన పాఠశాల,అంగన్వాడి కేంద్ర పిల్లలు**



**వాస్తవం : ధర్మపురి :** నో బ్యాగ్ డే సందర్భంగా ఎంపీపీ ఎస్ న్యూ హరిజనవాడ ధర్మపురి పాఠశాల, అంగన్వాడి కేంద్ర పిల్లలు క్షేత్రస్థాయి పర్యటనలలో భాగంగా స్థానిక పోలీస్ స్టేషన్‌ను సందర్శించారు. పోలీస్ స్టేషన్లో పోలీసులు చేసే విధులు,వారు సమాజానికి చేసే సేవలు గూర్చి సీఐ రామ నరసింహారెడ్డి, ఎస్సై సధకర్‌లు విద్యార్థులకు వివరిం చారు.పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ఆర్ కనకతార, ఉపాధ్యాయులు బి హరీష్, ఎస్ సరిత,అంగన్వాడి ఉపాధ్యాయురాలు మాధవి, తదితరులు పాల్గొన్నారు.

# ణేశుల నిమజ్జనోత్సవానికి ఏర్పాట్లు పూర్తి చేయాలి

**జిల్లా కలెక్టర్ సత్య ప్రసాద్**



**వాస్తవం: జగిత్యాల**

గణేశ్ నిమజ్జనం శాంతియుతంగా, ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసు కోకుండా సజావుగా జరిగేలా అన్ని విభాగాలు సమన్వయంతో కట్టుదిట్టమైన ఏర్పాట్లు పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ సత్య ప్రసాద్ అన్నారు. శనివారం జిల్లా ఎస్పి అశోక్ కుమార్ తో కలిసి గణేష్ నిమజ్జన ప్రాంతాలైన జగిత్యాలలో చింతకుంట చెరువు, కోరుట్లలో పెద్దవాగు, మెట్పల్లిలోని వట్టి వాగు, ప్రాంతాలను ప్రత్యక్షంగా పరిశీలించారు. అనంతరం సంబంధిత అధికారులకు చేపట్టనున్న పనులపై ఆదేశించారు.